సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 25.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి : 13 సంచిక :183
పేజీలు :12 వెల : రూ. 5



# ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

**మూడో రోజుకు చేరిన ఆందోళనలు**

- మూడో రోజుకు చేరిన ఆందోళనలు
- ఆర్టీసీ జేఏసీతో సర్కార్ చర్చలు
- డ్రైవర్ శంకర్ గౌడ్ మృతితో విషాదం
- ఆర్టీసీ సమ్మెతో బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- రాష్ట్రవ్యాప్తంగా వేల బస్సులు డిపోలకే పరిమితం
- అద్దె బస్సులు నడిపినా సమస్యలు తగ్గలేదు
- డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ఉద్రిక్తతకు దారి
- కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం హామీ
- 32 డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయి
- సమ్మె విరమణపై ఇంకా స్పష్టత లేదు

ముద్ర డెస్క్ :
తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని కార్మికులు తేల్చి చెబుతున్నారు. శుక్రవారం ఉదయం అన్ని జిల్లాల్లో బస్సులన్నీ డిపోలకే పరిమితం చేశారు. దాదాపు 10 వేల బస్సులను నిలిపివేసిన కార్మికులు రోడ్లపై బైఠాయిస్తున్నారు. ఆర్టీసీ సమ్మెతో మూడు రోజులుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లేక సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 11 డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికుల సమ్మె చేస్తున్నారు. కరీంనగర్ పరిధిలోని డిపోల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల మిగతా 2లో



ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కు
## సర్కార్ అండ

- తక్షణ సాయంగా రూ.10 లక్షలు
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు
- ఆర్టీసీ సమ్మె ఉద్రిక్తతల మధ్య కార్మికుల్లో తీవ్ర ఆవేదన
- ముత్తోజిపేటలో ఉద్రిక్త పరిస్థితులు, కార్మికుల ఆందోళనలు


03



## బండి సంజయ్– పోలీసుల మధ్య ఢీ

- ముత్తోజిపేటలో టెన్షన్ వాతావరణం..
- శంకర్ గౌడ్ మృతదేహం తరలింపుపై వివాదం..
- డిపోకు అనుమతి నిరాకరణ
- 365 జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్.. ఉద్రిక్తత
- కుటుంబం, బీజేపీ నేతల పట్టుదల..
- ప్రభుత్వంపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు..
- అంత్యక్రియలపై గందరగోళం

03




# ఎటువైపు గురి?

## రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం నుంచి కొత్త పార్టీ

**కవిత పార్టీ ఫస్ట్ టార్గెట్ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్? సెంటిమెంట్లు లేని రాజకీయాలే**

- ఇప్పటికే కేటీఆర్, హరీశ్ పై గురి
- కేసీఆర్ వ్యూహం లాగే.. కవిత వ్యాఖ్యలు
- పేరు చెప్పకుండానే కేసీఆర్ పై విమర్శలు
- ఇక నుంచి రాజకీయ సమరానికి శ్రీకారం?

ముద్ర, తెలంగాణ బ్యూరో :
కేసీఆర్ కుటుంబం నుంచి కొత్త పార్టీ ఆవిష్కృతమవుతోంది. కేసీఆర్ కూతురు కవిత కొత్త పార్టీని ప్రకటిస్తోంది. ఇప్పటికే కనిపించిన వాళ్లందరినీ.. గుర్తుకు వచ్చినవారందరినీ తూర్పారా పడుతున్న కవిత.. ఇప్పుడు కొత్త రాజకీయ వేదికపైకి వస్తోంది. మొన్నటిదాకా కేటీఆర్, హరీశ్, సంతోష్ వరకు వచ్చిన విమర్శనాస్త్రాలు.. ఇప్పుడిప్పుడే తండ్రి దాకా వస్తున్నాయి. కేసీఆర్ వ్యూహం మాదిరిగానే.. పేరు, ఊరు చెప్పకుండా కేసీఆర్ పై సైతం కవిత విమర్శలు మొదలుపెడుతున్నారు. ఇప్పుడు రాజకీయ వేదికపైకి వస్తుండటంతో.. ఇక విమర్శలు, సవాళ్లు నేరుగానే చేసే అవకాశాలు ఉన్నాయి. చూసుకుందామంటే.. చూసుకుందాం.. అన్నట్టే కవిత మాటలు ఉంటున్నాయి.

**కొత్త పార్టీ.. కొత్త రాజకీయం**
తెలంగాణ రాజకీయాల్లో మరికొన్ని గంటల్లో ఒక కొత్త అధ్యాయం మిగతా 2లో

## కవిత కొత్త ప్రయాణం

- నేడే సొంత పార్టీ ప్రకటన!
- మునీరాబాద్‌లో భారీ సభ...
- 50 వేల మందితో శక్తి ప్రదర్శనకు సిద్ధం
- కొత్త పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కవిత కొత్త ప్రయాణం ప్రారంభం
- అమరవీరులకు నివాళులతో ప్రారంభమయ్యే రాజకీయ ఆవిర్భావ సభ
- జెండా ఆవిష్కరణతో పాటు కీలక ప్రసంగానికి కవిత సిద్ధం
- తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా సభ, విందు ఏర్పాట్లు
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి వేదిక

02



## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం
- 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలతో సహా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి ఏర్పాటు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

10



## చర్చిద్దాం.. పరిష్కరించుకుందాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆర్టీసీ కార్మిక సంఘ నేతలతో మంత్రుల కమిటీ చర్చలు
- పాలనాపరమైన, విధానపరమైన నిర్ణయాలపై చర్చించుకుందాం
- ఆత్మహత్యలకు పాల్పడవద్దని పిలుపు
- ప్రజా పాలనలో ఎవరినీ శత్రువులుగా చూడం
- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నం

10


# సీఎం రేవంత్‌కు పెద్ద పరీక్ష

## ఆర్టీసీ డ్రైవర్ బలిదానంతో టార్గెట్ గా కాంగ్రెస్ సర్కార్



- నర్సంపేట డ్రైవర్ మృతితో మిన్నంటిన నిరసనలు
- ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న జేఏసీ
- స్తంభించిన రవాణా వ్యవస్థ.. ప్రయాణికుల అవస్థలు
- ఆవేశం వద్దు.. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపండి
- సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. చర్చలకు సిద్ధం

ముద్ర డెస్క్ :
తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెలో పెను విషాదం చోటుచేసుకుంది. 32 డిమాండ్ల సాధన కోసం నర్సంపేట డిపో ఎదుట ఆత్మబలిదానానికి ప్రయత్నించిన డ్రైవర్ శంకర్ గౌడ్ (50) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 1:30 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో మిగతా 2లో




## డిజిటల్ విప్లవం

- స్కూల్ రిపోర్ట్ కార్డుల పంపిణీలో మీ సేవ రికార్డ్
- నేరుగా తల్లిదండ్రులకు చేరిన రిపోర్ట్ కార్డులు
- 18 లక్షలకు పైగా పంపిణీ

02

ఇదీ AI ముద్ర






కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు
## హైకోర్టు ఊరట

- 'మిలీనియం మార్చ్' క్రిమినల్ కేసులు కొట్టివేత
- 2011 మిలీనియం మార్చ్ కేసులో కీలక మలుపు
- నిందితుల జాబితా నుంచి ప్రముఖ నేతలు బయటకు..
- ఆధారాల లేమితో కేసులు కొట్టివేత..
- దీర్ఘకాల న్యాయపోరాటానికి ముగింపు
- ఆస్తి ధ్వంసం ఆరోపణల్లో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టు స్పష్టం
- రాజకీయంగా చర్చనీయాంశమైన కేసుకు ఫుల్ స్టాప్

03



## చరిత్రలో చీకటి రోజు


- శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు, రేవంత్ సర్కార్ చేసిన హత్యే
- అధైర్యపడొద్దు.. ఆర్టీసీ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- ఆర్టీసీ డ్రైవర్ల ఆత్మహత్యయత్నాలు దారుణం
- నర్సంపేటలో అరెస్టులు దుర్మార్గం..
- నిరంకుశ పాలనపై విరుచుకుపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03



**వేసవిలో మద్యం తాగితే డీహైడ్రేషన్ ప్రమాదం**

వేసవిలో శరీరం ఇప్పటికే నీటిని కోల్పోతుంది. మద్యం తాగితే ఇంకా నీరు తగ్గి డీహైడ్రేషన్ వేగంగా పెరుగుతుంది.



# ఎటువైపు గురి?

మొదటిపేజీ తరువాయి

మొదలవ్వబోతోంది. కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రకటించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ ప్రక్రియలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. కవిత తన రాజకీయ లక్ష్యం విషయంలో స్పష్టతతో ఉండటం. ఆమె వేస్తున్న ప్రతి అడుగు, ఎక్కుపెడుతున్న ప్రతి విమర్శ కేవలం ఒకే ఒక్క దిశగా సాగుతున్నాయి. అదే బీఆర్ఎస్ ఓటు బ్యాంకు. ఎందుకంటే బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చడమే ఇప్పుడు కవిత ముందున్న అతి పెద్ద రాజకీయ సవాల్. బీఆర్ఎస్ కు ఎంత నష్టం చేస్తే.. రాజకీయంగా అంత ఎదిగినట్టుగా కవిత భావిస్తున్నారు. ఎందుకంటే స్వయంగా కవిత కూతురు అయినా.. కొంతమంది కీలకం అనుకున్న నేతలు కవితను బీఆర్ఎస్ లోనే తొక్కి పెట్టారు. అదే ఇప్పుడు అసలు కోపం అంతా.

**అసలు టార్గెట్ కాంగ్రెస్, బీజేపీ కాదు.. బీఆర్ఎస్సే!**

సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండాగా కనిపిస్తోంది.

**కారుకు బ్రేకులు వేసే వ్యూహం**

బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాధృచ్ఛికం కాదు. రేపు జరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్.

**రాజకీయ ఉనికి కోసం పోరాటం**

నేటి రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు.

**చూసీచూడనట్టు రాజకీయ సమరం**

రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు.. కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బిటీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది. రేపటి సభలో ఆమె ప్రకటించబోయే పార్టీ పేరు, విధివిధానాలు బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ మేరకు ప్రభావితం చేస్తాయోనన్న ఆందోళన ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కవిత కొత్త ప్రయోగం' విజయవంతమైతే, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడం అత్యంత కష్టతరంగా మారవచ్చు.

# కవిత కొత్త ప్రయాణం

- నేడే సొంత పార్టీ ప్రకటన!
- మునీరాబాద్‌లో భారీ సభ... 50 వేల మందితో శక్తి ప్రదర్శనకు సిద్ధం
- కొత్త పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కవిత కొత్త ప్రయాణం ప్రారంభం
- అమరవీరులకు నివాళులతో ప్రారంభమయ్యే రాజకీయ ఆవిర్భావ సభ
- జెండా ఆవిష్కరణతో పాటు కీలక ప్రసంగానికి కవిత సిద్ధం
- తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా సభ, విందు ఏర్పాట్లు
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి వేదిక

ముద్ర, హైదరాబాద్ :



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ ప్రకటనకు రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ సమీపంలో ప్రత్యేకంగా రూపొందించిన "ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం" అట్టహాసంగా ముస్తాబై, తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి వేదికగా సిద్ధమైంది. దాదాపు 20 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంగణంలో భారీ స్థాయి వేదిక, ప్రత్యేక అతిథుల కోసం ఏర్పాట్లు, వేలాది మంది కార్యకర్తలకు సౌకర్యాలు కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతిని స్థాపించిన కవిత, రెండు దశాబ్దాల తన ప్రజా జీవితంలో ఎన్నో పోరాటాలు, మైలురాళ్లు చూసిన తరువాత ఇప్పుడు స్వీయ రాజకీయ శక్తిని నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు ఆమె వర్గాలు వెల్లడిస్తున్నాయి. శనివారం ఉదయం కార్యక్రమాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 7.30 గంటలకు బంజారాహిల్స్‌లోని నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరనున్న కవిత, 8.15 గంటలకు గన్‌పార్క్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తారు. అనంతరం 8.25 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి, ఉదయం 9.30 గంటలకు మునీరాబాద్ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. కచ్చితంగా ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరించి, వెంటనే పార్టీ పేరు ప్రకటించనున్నారు. ఆపై ప్రారంభమయ్యే ప్రసంగం సుమారు గంటన్నర పాటు కొనసాగనుంది. సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నట్లు అంచనా. ట్రాఫిక్, పార్కింగ్, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్, ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు కూడా సిద్ధం చేశారు. సభా ప్రాంగణానికి తెలంగాణ గౌరవ ప్రతీకల పేర్లు నామకరణం చేశారు. ప్రధాన ద్వారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో ఉండగా, ఇతర ద్వారాలకు రాణి రుద్రమదేవి, మారోజు వీరన్న, చాకలి ఐలమ్మ పేర్లు పెట్టారు. భోజనశాలలకు సురవరం ప్రతాపరెడ్డి, సమ్మక్క-సారలమ్మ, షోయబుల్లా ఖాన్ పేర్లు పెట్టి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. పార్టీ ఆవిర్భావ సభ అనంతరం కార్యకర్తలు, అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. తెలంగాణ సంప్రదాయ రుచులతో 34 రకాల వంటకాలను సిద్ధం చేశారు. నాన్‌వెజ్‌లో తలకాయ కూర, బోటీ ఫ్రై, తెలంగాణ మటన్ కర్రీ, నాటు కోడి పులుసు, బొమ్మిడాయల పులుసు, హైదరాబాదీ చికెన్ దమ్ బిర్యానీ, మిర్చి కా సాలాన్, ఎగ్ ఇగురు వంటివి ఉండనున్నాయి. వెజిటేరియన్ విభాగంలో బగరా బైంగన్, కందగడ్డ ఫ్రై, పాలకూర, మామిడి పప్పు, ఆలూ టమాటా, చామగడ్డ పులుసు, కట్ చారు వంటి వంటకాలు సిద్ధం చేశారు. ఇక తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించే మక్క గారెలు, జొన్న రొట్టె, సర్వపిండి, బూరెలు, అరిసెలు వంటి సంప్రదాయ వంటకాలు కూడా మెనూలో ఉన్నాయి. బగరా రైస్, వైట్ రైస్, సాంబర్, రోటి పచ్చడి, దోస, ఆవకాయ, మిర్చి బజ్జీ, పచ్చి పులుసు, పపడ్, పెరుగు, రైతా వంటి వంటకాలతో పాటు మజ్జిగ, రాగి అంబలి కూడా అందుబాటులో ఉంచనున్నారు. డెజర్ట్‌లో బటర్ స్కాచ్ ఐస్‌క్రీమ్, షాహీ తుక్‌డా, జిలేబీ వడ్డించనున్నారు. మొత్తంగా రాజకీయంగా కీలకమైన ఈ సభ ద్వారా కల్వకుంట్ల కవిత తన రాజకీయ దిశను స్పష్టంగా వెల్లడించనుండగా, తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనుందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

# ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

మొదటిపేజీ తరువాయి



సౌకర్యార్థం అధికారులు అద్దె ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కామారెడ్డి డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. పోలీసుల పహారా నడుమ అద్దె బస్సులను అధికారులు నడిపిస్తున్నారు. నల్గొండ, మిర్యాలగూడ డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల ధర్నా చేశారు. బీఆర్‌టీయూ, బీఆర్ఎస్‌వీ నాయకులు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. సూర్యాపేటలో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. గోదావరిఖని, హుస్నాబాద్, నిజామాబాద్ వంటి పలు జిల్లాల్లో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమ్మె చురుకుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. సమ్మె నేపథ్యంలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. జిల్లాల్లో పలు ప్రాంతాల్లో అద్దె బస్సులు పాక్షికంగా నడిచినా, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు ప్రాంతాలలో ఎలక్ట్రిక్ బస్సులు, ప్రైవేటు బస్సులను ఆర్టీసీ అధికారులు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నడిపించారు. జిల్లాల్లో ఉదయం నుంచే డిపోల వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. కార్మికుల ధర్నాకు వివిధ పార్టీల నాయకులు తమ మద్దతును ప్రకటించారు. ఆర్టీసీ సమ్మెతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించారు. ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు ఛార్జీలు పెంచడంతో పలు చోట్ల వాహనదారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. సమ్మెతో ప్రజా రవాణా స్తంభించిపోవడంతో మహిళలు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి కూలీలు ఇబ్బందులు పడ్డారు. తమ డిమాండ్లపై హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు తేల్చి చెప్పారు. మరోవైపు గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సీనియర్ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఉదంతంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఆగ్రహంతో నిరసన కదం తొక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన బాట పట్టారు. అంతకు ముందు తోటి ఉద్యోగులతో కలిసి ఉదయం డిపో ఎదుట చేపట్టిన ధర్నాలో పాల్గొన్న శంకర్‌గౌడ్, తర్వాత ఇంటికెళ్లి ఖాకీ దుస్తులు వేసుకొని కొద్ది సమయం తర్వాత బస్టాండ్‌కు వచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమ్మెలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు కొందరు డిపో ఎదుట చెట్టునీడన ఉండగా, ఇంకొందరు బస్టాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో బైక్ పార్కింగ్ వైపు ద్వారం నుంచి బస్టాండ్ లోపలికి వచ్చిన శంకర్‌గౌడ్ కార్గో కార్యాలయం దగ్గర ఒంటిపై పెట్రోల్ చల్లుకొని ఒక్కసారిగా నిప్పంటించుకున్నారు. మంటలకు కేకలు వేస్తూ అక్కడి నుంచి బస్టాండ్‌లోకి వస్తుండగా అది చూసిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, విధుల్లో ఉన్న పోలీసులు హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పివేశారు. శంకర్‌గౌడ్‌ను తొలుత నర్సంపేట ఆసుపత్రికి, తర్వాత వరంగల్ ఎంజీఎంకు అంబులెన్సులో తరలించారు. వరంగల్ కలెక్టర్ సత్య శారద, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ హుటాహుటిన అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తీవ్ర గాయాలు కావడంతో గొంతులో వాపు పెరిగి శంకర్‌గౌడ్ మాట్లాడటం ఇబ్బందిగా మారింది. దీంతో పోలీసులు మరణ వాంగ్మూలం కోసం ప్రయత్నాలు ఆపేసి చికిత్స కొనసాగించారు. అనంతరం వెంటిలేటర్ అమర్చి హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. 85 నుంచి 95 శాతం మేరకు తీవ్రంగా కాలిన గాయాలకు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తుండగా శంకర్ గౌడ్ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆర్టీసీ జేఏసీ నేతలు ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి, అశ్వత్థామరెడ్డి తదితరులు ఆసుపత్రిలో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. శంకర్ గౌడ్ మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి దేవుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలోనే కార్మికులు ఆందోళన చెందవద్దని, క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తుందని తెలిపారు. మరోవైపు, ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. డ్రైవర్ మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కార్మిక సంఘం నేతలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేడు సమావేశం కానున్నారు. వారి సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెపై చర్చ జరిగింది. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లు, వాటికి పరిష్కారాలు, సమ్మె పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రులు తెలిపారు. ''ఆర్టీసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాం. పీఆర్సీ, ఉద్యోగుల విలీనం, సంఘాలకు గుర్తింపుపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కార్మికులెవరూ తొందరపాటు చర్యలకు పాల్పడవద్దు. అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు'' అని వారు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండల పరిధిలోని ముత్తోజిపేట గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించేందుకు కార్మికులు, కుటుంబ సభ్యులు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లి నిరసన తెలపాలన్న కార్మికుల నిర్ణయాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, కార్మికుల మధ్య భారీ వాగ్వాదం జరగ్గా పోలీసుల వాహనం ధ్వంసమైంది. ఒకరినొకరు నెట్టుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియాను అందజేసింది. అతని కుమారుడికి ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించింది. మధ్యాహ్నం తర్వాత శంకర్ గౌడ్ అంత్యక్రియలు జరగనున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలతో ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. శుక్రవారం ఉదయం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో భాగంగా తొలుత ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, దానకిషోర్, సందీప్ సుల్తానియాతో ఆర్టీసీ జేఏసీ నేతలు భేటీ కానున్నారు. అనంతరం మంత్రుల బృందంతో ఈ నేతలు సమావేశం కానున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు మొత్తం 32 డిమాండ్లు ప్రభుత్వం ఎదుట ఉంచగా, వాటిలో 29 సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, రెండు పీఆర్సీలు, ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ ఎన్నికల నిర్వహణ వంటి మూడు కీలక డిమాండ్లపై నేడు స్పష్టత రానుంది.



# సీఎం రేవంత్ కు పెద్ద పరీక్ష

మొదటిపేజీ తరువాయి

కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలియగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోల వద్ద ఉద్రిక్తత నెలకొంది.

**నిప్పుల కొలిమిగా మారిన నిరసన**

ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం (ఏప్రిల్ 23) నర్సంపేట డిపో వద్ద నిరసన తెలుపుతున్న సమయంలో, శంకర్ గౌడ్ ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. 80 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్న ఆయన్ను తొలుత వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు విఫలమవ్వడంతో ఆయన తుదిశ్వాస విడిచారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. ప్రభుత్వంపై ఒత్తిడి**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మరణం తనను కలిచివేసిందని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్మికులు ఎవరూ ఆత్మహత్యల వంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం శుక్రవారం యూనియన్ నాయకులతో చర్చలు జరుపుతుందని ప్రకటించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, కార్మికుల 32 డిమాండ్లలో ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం ఉందని, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు.

**రగిలిపోతున్న కార్మికులు.. స్తంభించిన రవాణా**

శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ వరంగల్, హైదరాబాద్, నల్గొండ సహా పలు జిల్లాల్లో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. శంకర్ గౌడ్ భౌతికకాయాన్ని నర్సంపేటకు తరలించే క్రమంలో ఎక్కడికక్కడ నిరసనలు మిన్నంటుతున్నాయి.

**ప్రస్తుత పరిస్థితి**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,000కు పైగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దాదాపు 38,000 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు.


**డిమాండ్లు ఏంటి?**

ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ బకాయిలు చెల్లించడం, కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుతో పాటు 32 డిమాండ్లను నెరవేర్చాలని జేఏసీ పట్టుబడుతోంది. శంకర్ గౌడ్ బలిదానంతో ఈ సమ్మె ఇప్పుడు పతాక స్థాయికి చేరుకుంది. నేడు జరగబోయే చర్చలలో ప్రభుత్వం ఏ మేరకు దిగివస్తుంది, కార్మికులు సమ్మె విరమిస్తారా లేదా అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# డిజిటల్ విప్లవం

- స్కూల్ రిపోర్ట్ కార్డుల పంపిణీలో మీ సేవ రికార్డ్
- నేరుగా తల్లిదండ్రులకు చేరిన రిపోర్ట్ కార్డులు
- 18 లక్షలకు పైగా పంపిణీ

ముద్ర, తెలంగాణ బ్యూరో :





రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ పాలనలో మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా గవర్నమెంట్ పాఠశాలల్లో చదువుతున్న 5వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థుల వార్షిక రిపోర్ట్ కార్డులు నేరుగా తల్లిదండ్రులకు చేరాయి. 18 లక్షలకుపైగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు మీ సేవ ద్వారా నేరుగా పేరెంట్స్ వాట్సాప్ నెంబర్ కు విజయవంతంగా పంపిణీ చేసింది. ఐటీ శాఖ ఆధ్వర్యంలో మీ సేవా ద్వారా వీటిని పంపిణీ చేశారు. దీనిద్వారా విద్యార్థుల అకడమిక్ రికార్డులు స్కూల్ కు వెళ్లకుండానే తక్షణం, సురక్షితంగా, పేపర్‌లెస్ విధానంలో తల్లిదండ్రులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి, తల్లిదండ్రులకు సాంకేతిక సేవలు చేరాలనే లక్ష్యంతో వాట్సాప్ ద్వారా రిపోర్ట్ కార్డులు అందించామని వెల్లడించారు. దీని ద్వారా ఆయా కుటుంబాలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని, ఇది తెలంగాణ డిజిటల్ గవర్నెన్స్ కు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు సులభంగా, వేగవంతమైన సేవలను అందించడంలో మరోసారి విజయవంతం అయిందని ఆయన అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 25-04-2026
www.mudranews.in | @mudranews



**వేసవిలో మద్యం తాగితే ..**
**హీట్ స్ట్రోక్ ప్రమాదం**

మద్యం శరీర ఉష్ణోగ్రత నియంత్రణను దెబ్బతీస్తుంది. దీంతో హీట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.





## బండి సంజయ్, పోలీసుల మధ్య ఢీ

- ముత్తోజిపేటలో టెన్షన్ వాతావరణం..
- శంకర్ గౌడ్ మృతదేహం తరలింపుపై వివాదం..
- ప్రభుత్వంపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు..

ముద్ర, తెలంగాణ బ్యూరో:

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం ముత్తోజిపేటలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముత్తోజిపేటకు చేరుకుని కేంద్ర మంత్రితో మాట్లాడారు. నర్సంపేట డిపోకు శంకర్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో ముత్తోజిపేటలో పరిస్థితి బండి సంజయ్ వర్సెస్ పోలీసులు అన్నట్టుగా కొనసాగింది. మరోవైపు శంకర్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించాల్సిన కొడుకు హేమంత్‌ను బీజేపీ నేతలు నర్సంపేట డిపోకు తీసుకెళ్లారు. శంకర్ గౌడ్ డెడ్ బాడీని తిరిగి కూతురు ఇంటికి తరలించారు పోలీసులు. దీంతో అంత్యక్రియలపై చాలా సేపు సస్పెన్స్ కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో శంకర్ మృతదేహాన్ని డిపోకు తరలించాలని బండి సంజయ్ పట్టుబట్టగా.. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో 365 జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అంతకుముందు భారీ కాన్వాయ్‌తో బండి సంజయ్, బీజేపీ శ్రేణులు ముత్తోజిపేటకు చేరుకున్నారు. శంకర్ గౌడ్ మృతదేహానికి కేంద్ర మంత్రి నివాళులర్పించారు. బండి సంజయ్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### బండి సంజయ్ సీరియస్..

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లనీయకపోవడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే శాంతిభద్రతల సమస్య సృష్టిస్తోందని ఆరోపించారు. మానవతా విలువలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సంప్రదాయాలను విస్మరిస్తోందని అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నేతలు ఆర్టీసీ కార్మికుల దగ్గరకు వెళ్లి రాజకీయం చేయలేదా అని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లనివ్వకపోతే రేపటి వరకూ మృతదేహం ఇక్కడే ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం కుటుంబ సభ్యులకైనా మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లే అవకాశం కల్పించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి సర్కార్ అండ

- తక్షణ సాయంగా రూ.10 లక్షలు
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు





ముద్ర, తెలంగాణ బ్యూరో:

టీజీఎస్‌ఆర్టీసీ సమ్మెలో భాగంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. ఆయన మృతి ఆర్టీసీ కార్మికుల్లో తీవ్ర ఆవేదన నింపిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి అధికారిక ప్రకటన చేశారు. శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించిన ఆర్డీవో ఉమారాణి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అందించే సహాయ సహకారాలను అందిస్తామన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. నిరుపేద కుటుంబం కావడంతో శంకర్ గౌడ్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా మరో రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

గత 25 ఏళ్లుగా ఆర్టీసీలో డ్రైవర్‌గా సేవలందించిన శంకర్‌కు భార్య హేమలత, కుమార్తె షామిలి, కుమారుడు హేమంత్ ఉన్నారు. భార్య హేమలత దివ్యాంగురాలని తెలిసింది. సొంతిల్లు లేకపోవటంతో కూతురు స్వగ్రామం నర్సంపేట మండలం ముత్తోజిపేటకు మృతదేహాన్ని తరలించారు. అక్కడే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శంకర్ గౌడ్‌కు నివాళి అర్పించారు.

### ముత్తోజిపేటలో ఉద్రిక్తత..

శంకర్ గౌడ్ మృతితో ముత్తోజిపేటలో ఉద్రిక్తత నెలకొంది. ఆయన మృతదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులర్పిస్తామని ఆర్టీసీ కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సైతం కార్మికులతో కలిసి శంకర్ గౌడ్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్తుండగా బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్ది సేపు తోపులాట జరిగింది. కార్మికుల ఆందోళనతో ముత్తోజిపేటలో ఉద్రిక్తత నెలకొంది.

మరోవైపు శంకర్ గౌడ్ బల వన్మరణంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని.. వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిందని చెప్పారు. ఆర్టీసీ సమ్మె నేప థ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మ హత్యాయత్నాలకు పాల్పడడం కలచి వేసిందని అన్నారు. ముఖ్యంగా డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శంకర్ గౌడ్ కుటుంబానికి తగిన పరి హారం చెల్లించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, బీజేపీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసిందని రాంచందర్ రావు గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

### ఉద్రిక్తతలకు బండి సంజయ్ కారణం..

**- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్**



నర్సంపేటలో ఉద్రిక్తతలకు కేంద్రమంత్రి బండి సంజయ్ కారణమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి హోదాలో కొనసాగుతూ శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మి కులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూస్తుంటే.. బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడ వద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు.

## చరిత్రలో చీకటి రోజు

- శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు, రేవంత్ సర్కార్ చేసిన హత్య..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఆర్టీసీ కార్మికులను కోరారు. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ అందరం కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ది ఆత్మహత్య కాదని, ఇది ముమ్మాటికీ రేవంత్ సర్కార్ చేసిన హత్యేనని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసీ కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం దుర్మార్గ చర్య అని అసహనం వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు.. బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసి కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు హైకోర్టు ఊరట

- 'మిలీనియం మార్చ్' క్రిమినల్ కేసులు కొట్టివేత



ముద్ర, తెలంగాణ బ్యూరో:

హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో భారీ ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసమయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరపు న్యాయవాదులు వాదించారు.

### కోర్టులో వాదనలు..

ఈ కేసులో న్యాయవాది రమణారావు వాదనలు వినిపిస్తూ, పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది.

తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.



### రేవంత్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

**- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**


ముద్ర, కుత్బుల్లాపూర్ :

జీడిమెట్ల బస్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంఘీభావం తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కు నివాళి అర్పించి మాట్లాడారు. ఆర్టీసీ డిమాండ్లు న్యాయమైనవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి గెజిట్ ను రిలీజ్ చేశారని, కానీ రేవంత్ సర్కార్ ఆర్టీసీ విలీన ప్రక్రియను అమలు చేయకుండా కావాలనే అడ్డుకుంటుందని మండిపడ్డారు.

హైదరాబాద్ లో లేని నగరం సృష్టించేందుకు వేల కోట్లు, మూసి ప్రక్షాళన పేరిట రూ.1.50 లక్షల కోట్లు వెచ్చిస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ లో రేవంత్ రెడ్డి తన సీటు కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు తప్ప ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అన్ని వాగ్దానాల హామీలు నేరవేర్చే వరకు రాష్ట్ర ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, జగన్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అవకతవకలపై దర్యాప్తు

- హైకోర్టు సంచలన ఆదేశాలు



ముద్ర, డెస్క్ :

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీసీఐడీలోని సిట్‌తో దర్యాప్తు జరగాలని, అపెక్స్ కౌన్సిల్ జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షణలో హెచ్‌సీఏ పనిచేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రికెట్ సంఘం అక్రమాలపై సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీఏకు స్వయం ప్రతిపత్తి ఉందన్న కారణంతో న్యాయవ్యవస్థ పరిధి నుంచి తప్పించుకోలేరని, అవినీతి, అక్రమాలు జరిగినప్పుడు పారదర్శకత విషయంలో కోర్టులు జోక్యం చేసుకుంటాయని న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక పేర్కొన్నారు. దర్యాప్తునకు అధికారులు, సిబ్బంది సహకరించాలని ఆదేశించారు.

## ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం భద్రతా ఏర్పాట్లపై నివేదిక

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేసిన ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్రవేత్త సత్యనారాయణ



ముద్ర, తెలంగాణ బ్యూరో:

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాలలో అనుకరించాల్సిన భద్రతా ఏర్పాట్లపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమగ్రంగా రూపొందించిన నివేదికను ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్రవేత్త సత్యనారాయణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్.జి.ఆర్.ఐ సంస్థను అభినందించడంతో పాటు ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతితో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో బాగమైన మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు గాను ఎన్.జి.ఆర్.ఐ ఆధ్వర్యంలో భూపరిశోధన(సాయిలు టెస్ట్) భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇ ఎన్ సి రమేష్ బాబు సొరంగ మార్గం తవ్వకాల నిపుణుడు పరిక్షిత్ మెహ్రా,ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకే తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఎన్.జి.ఆర్.ఐ తో సమగ్రంగా సర్వే నిర్వహించినట్లు తెలిపారు. తవ్వకాల సమయంలో ముందస్తుగా ప్రమాద అవకాశాలను గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థ సీస్మిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటి టొమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వివరించారు. సొరంగ మార్గం తవ్వకాలలో కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రాధాన్యతాంశంగా పెట్టుకుందన్నారు. అందుకు తగినట్లు గానే ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తల మార్గదర్శనానికి అనుగుణంగానే సొరంగ మార్గం తవ్వకాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
25.04.2026 శనివారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి.. మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744, అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# బుద్ధి దారితప్పితే..



బుద్ధి గడ్డితింటే—
గమనాల గూటిలో గాలివానలు దూసుకెళ్లగా
గమనికలన్నీ గాలికొదిలి
గరిక మొలకల మధ్య గుండె చప్పుడు
మరిచిపోతుంది||

బుద్ధి మొద్దుబారితే—
నిన్నటి నెమరులు నేడు నిశ్శబ్దమై
నిజాలన్నీ నిద్రలోనే నడుస్తుంటే
నవ్వులకే అర్థం అడగలేని దశలో
నిలిచిపోతుంది||

బుద్ధి మొండికేస్తే—
మార్పు తలుపు తట్టినా గుమ్మం తెరవని దృఢత
మాటల మడుగులో మునిగి
మనసే మలుపు తిరగని మూర్ఖత్వంగా
మారిపోతుంది||


బుద్ధి నిద్రపోతే—
జాగరణ గడియారాలు మోగినా వినని నిశ్చలత
జీవిత జ్యోతి మసకబారగా
జ్ఞానం జారిపడిన జాబిలిలా జారిపోతుంది||

బుద్ధి ఎగిరిపోతే—
కల్పనల కిటికీ దాటి ఆకాశంలో కలిసిపోయి
కారణాలన్నీ కరిగిపోతే
కలలే కళ్లలో నిలిచిన గాలిపటమై
తేలిపోతుంది||

బుద్ధి మూగపోతే—
చైతన్యం చిగురించని చీకటి చెరలో
సత్యం సన్నగిల్లి సన్నని శ్వాసగా మారి
స్మృతుల సమాధిలో సద్దుచేయక
పడుకుంటుంది||

అయితే—
ఒక చినుకు చైతన్యం చాలు,
ఒక చిరునవ్వు చాలు,
ఒక చిగురు ఆశ చాలు జాగృతమవడానికి||

అప్పుడు—
మళ్లీ బుద్ధి మేల్కొంటుంది,
మళ్లీ వెలుగులు వెలుగుతాయి,
మనసు మార్గం కనుగొని మళ్లీ మంచి
దారిపడుతుంది||



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం

# న్యాయవాది ఆవేదన: వృత్తి ధర్మం - స్నేహ బంధం

- **రెండూ వేర్వేరుగానే ఉండాలి.. నా అభిప్రాయం .**

**సమాజంలో ప్రతి వృత్తికి ఒక విలువ ఉంటుంది. డాక్టర్ ప్రాణాన్ని కాపాడితే డబ్బులు తీసుకుంటాడు, ఇంజనీర్ ప్లాన్ వేస్తే ఫీజు అడుగుతాడు, ఒక కార్మికుడు కష్టపడితే కూలి అడుగుతాడు. వీరందరినీ గౌరవించే ఈ సమాజం, ఒక్క న్యాయవాది (లాయర్) విషయంలో మాత్రం వింత ధోరణిని ప్రదర్శిస్తుంది. ముఖ్యంగా స్నేహితుల మధ్య ఒక లాయర్ పడే ఆవేదన వర్ణనాతీతం.**



### ఉచితంగా ఇస్తేనే స్నేహం.. ఫీజు అడిగితే 'కమర్షియల్'?

పూర్వపు స్నేహితుల మధ్య జరిగిన ఒక యదార్ధ ఉదంతాన్ని పరిశీలిస్తే ఈ వివక్ష అర్థమవుతుంది. ఆ బ్యాచ్‌లోని ఒక లాయర్, తన స్నేహితులకు కష్టం వస్తే అర్ధరాత్రి కూడా పోలీస్ స్టేషన్లకు వెళ్లాడు. స్నేహితులకే కాకుండా వారు పంపిన పరిచయస్తులకు కూడా ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చాడు, కేసులు వాదించాడు. ఆస్తులకు సంబంధించి కేసులు వాదించాడు ఆస్తులు ఇప్పించాడు ఒక రూపాయి ఫీజు కూడా వారు ఇవ్వలేదు "సలహా ఇవ్వడానికి ఖర్చవుతుందా?" నా స్నేహితులే కదా అనే భావనతో వారందరికీ సహాయం చేస్తూ వచ్చాడు.

కానీ కాలక్రమేణా అతనికి ఒక చేదు నిజం అర్థమైంది. అదే స్నేహితుల్లో ఒకరు కార్పెంటర్ అయితే పని చేసి మార్కెట్ రేటు కంటే ఎక్కువే తీసుకున్నాడు. ఎలక్ట్రీషియన్ గంట పనికి రోజు కూలి అడిగాడు. స్నేహితుడైన డాక్టర్ కూడా 'ఓపి' ఫీజు దగ్గర నుండి చికిత్స వరకు ప్రతి పైసా వసూలు చేశాడు. అక్కడ ఎవరికీ స్నేహం అడ్డం రాలేదు, అది వారి వృత్తిగా అందరూ గుర్తించారు. కానీ ఆ లాయర్ తన కుటుంబాన్ని పోషించుకోవడానికి, తన వృత్తికి విలువ ఇస్తూ నామమాత్రపు ఫీజు అడగడం మొదలుపెట్టగానే.. అదే స్నేహితుల బ్యాచ్ అతనికి 'కమర్షియల్' అనే ముద్ర వేసింది.

### లాయర్‌కు ఖర్చు ఏమవుతుంది?

చాలా మంది దృష్టిలో "లాయర్‌కు ఖర్చు ఏముంది? కేవలం మాటలతోనే కదా పని అయిపోయేది" అనే అపోహ ఉంది. కానీ వారు గమనించని నిజాలు కొన్ని ఉన్నాయి :

ఆ మాటల వెనుక సంవత్సరాల తరబడి చదివిన చదువు, సంపాదించిన అనుభవం ఉంటుంది. ప్రతి కేసు వెనుక ఎంతో మేధోమథనం, నిద్రలేని రాత్రులు ఉంటాయి.

లాయర్‌కు కూడా ఒక కుటుంబం ఉంటుంది, పిల్లల చదువులు ఉంటాయి. ఆ వృత్తి మీద వచ్చే ఆదాయమే ఆ కుటుంబానికి ఏకైక ఆధారం.

మిగిలిన వృత్తుల వారు డబ్బు తీసుకుంటే అది "సర్వీస్ ఛార్జ్" అవుతుంది, కానీ లాయర్ ఫీజు అడిగితే మాత్రం "స్వార్థం" ఎందుకు అవుతుంది? స్నేహాన్ని అడ్డం పెట్టుకుని వృత్తిని తక్కువ చేయడం ఎంతవరకు సమంజసం? ఏ వృత్తిలోనైనా శ్రమకు ప్రతిఫలం ఉంటుంది. ఒక కార్పెంటర్ శ్రమ చేతుల్లో ఉంటే, ఒక లాయర్ శ్రమ మేధస్సులో ఉంటుంది.

వృత్తి ఏదైనా గౌరవం ఒక్కటే. ఒక లాయర్ తన సమయాన్ని, జ్ఞానాన్ని మీ కోసం వెచ్చిస్తున్నాడంటే, దానికి ప్రతిఫలం ఆశించడం అతని హక్కు, బాధ్యత కూడా. స్నేహాన్ని గౌరవించండి, కానీ వృత్తిని చులకన చేయకండి. లాయర్ కోర్టులో నల్ల కోటు వేసుకున్నంత మాత్రాన అతను యంత్రం కాదు.. అన్ని అవసరాలు, భావోద్వేగాలు ఉన్న ఒక సగటు మనిషి, ఒక తండ్రి, ఒక ఇంటి యజమాని అని గుర్తించాలి.

కృష్ణచక్రవర్తి, న్యాయవాది

# మానసిక ఒత్తిడిలో ప్రైవేట్ అధ్యాపకులు

ప్రైవేట్ విద్యాసంస్థల్లో లెక్చరర్లు, టీచర్లు విద్యార్థుల ప్రవేశాల కోసం ఒత్తిడికి గురవుతున్న సమస్య ఇటీవలి కాలంలో తీవ్రమవుతోంది. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుకున్న కొన్ని కార్పొరేట్ యాజమాన్యాలు, తమ సంస్థలలో చేరికలు పెంచేందుకు బోధకులపై అసమంజసమైన లక్ష్యాలను మోపుతున్నాయి. ఇది విద్యా వ్యవస్థలో నైతిక విలువలను దెబ్బతీసే ప్రమాదకర ధోరణిగా మారింది.



ముఖ్యంగా పాఠశాలలు, కాలేజీలు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే "ఎంత మంది విద్యార్థులను తీసుకొచ్చారు?" అనే ప్రశ్నను బోధకుల పనితీరుతో నేరుగా అనుసంధానిస్తున్నాయి. ఫలితంగా, టీచర్లు తమ అసలు బాధ్యత అయిన బోధనకు దూరమై, మార్కెటింగ్ ప్రతినిధులుగా మారాల్సిన పరిస్థితి వస్తోంది. కొందరు యాజమాన్యాలు లక్ష్యాలను చేరుకోలేకపోతే జీతాల కోతలు, ఉద్యోగ భద్రతపై బెదిరింపులు, మానసిక వేధింపులు వంటి చర్యలకు దిగుతున్నాయి.

ఇదికాక, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే అనేక మంది బోధకులకు ప్రాథమిక కార్మిక హక్కులు కూడా అందడం లేదు. ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ వంటి భద్రతా సదుపాయాలు లేకపోవడం, ఆరోగ్య భీమా కల్పించకపోవడం, చెల్లించాల్సిన సెలవులను నిరాకరించడం వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల రోజుకు 10-12 గంటలకు పైగా పని చేయించడంతో పాటు, అదనపు పనికి సరైన పారితోషికం ఇవ్వడం లేదు. ఈ అధిక పని గంటల ఒత్తిడి బోధకుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుల గౌరవం తగ్గిపోతోంది. విద్యార్థుల మేధో వికాసం కోసం సమయం కేటాయించాల్సిన ఉపాధ్యాయులు, ప్రవేశాల కోసం తిరగాల్సి రావడం, మరోవైపు ఉద్యోగ భద్రత లేకపోవడం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. దీని ప్రభావం నేరుగా విద్యా ప్రమాణాలపై పడుతోంది.విద్యార్థుల విషయంలో కూడా ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. సరైన సమాచారం లేకుండా, కేవలం ఒత్తిడితో లేదా ప్రలోభాలతో విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారు. విద్య అనేది సమగ్ర అభివృద్ధికి దారి చూపాల్సిన సాధనం; కానీ అది వ్యాపార లాభాల సాధనంగా మారిపోతే సమాజం మొత్తం నష్టపోతుంది .ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ విద్యాసంస్థల నియంత్రణలో పారదర్శకతను పెంచి, బోధకులపై అనవసర ఒత్తిడిని నిషేధించే విధానాలను అమలు చేయాలి. పి.ఎఫ్, గ్రాట్యుటీ, ఆరోగ్య భీమా, చెల్లించాల్సిన సెలవులు వంటి హక్కులను తప్పనిసరిగా అమలు చేయించేలా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ సమస్యపై గళమెత్తి, బోధకుల హక్కులను రక్షించాల్సిన అవసరం ఉంది.మొత్తానికి, విద్యాసంస్థలు లాభాపేక్ష కంటే విలువల ఆధారంగా నడవాలి. బోధకుల గౌరవం, హక్కులు కాపాడితేనే విద్యా వ్యవస్థ బలపడుతుంది. లేకపోతే, భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించడం కష్టమవుతుంది.




ఆళవందార్ వేణు మాధవ్
8686051752,
హైదరాబాద్

# బహుజన తెలంగాణ ఉద్యమ స్వరం "వొల్లెడ"

దీర్ఘ కవితలు తెలుగు, తెలంగాణ సాహిత్యంలో విస్తృతమైన ప్రక్రియ. ఇవి ఒక్కో దృక్పథానికి నాంది పలుకుతూ, తక్కువ పదజాలంలోనే ఎక్కువ అర్థాలను ధ్వనింపచేస్తాయి. కవిత్వంలోని గంభీరతను, ఉద్యమంలోని ఉత్సాహాన్ని దీర్ఘ కవితలు సమగ్రమైన రూపానికి ప్రతిబింబాలు. ఒకే వస్తువును స్వీకరించి వాటికి ఎత్తు పల్లాలను కుదిర్చి పాఠకున్ని ఆకట్టుకొని చివరివరకు వెంటాడే కవిత్వం. ఆవేదనతో, ఆశయంతో, ఓర్పుతో, ఆలోచనలతో అల్లిన ఈ పదజాలం హృదయాలను కదిలించే శక్తికి ప్రతీక. ఆ కోవలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి (దాలి), జూలూరి గౌరీ శంకర్ (పాదముద్ర), పసునూరి రవీందర్ (లడాయి), బన్న ఐలయ్య (నిప్పుకణిక) మొదలైన దీర్ఘ కవితలెన్నో తెలంగాణ సాహిత్యాన్ని పరిపుష్టం చేశాయి. ఆ పరంపరలో దీర్ఘ కవిత్వాన్ని రాస్తున్న కవి, రచయిత, విమర్శకుడు, తెలంగాణ ఉద్యమ నేత వనపట్ల సుబ్బయ్య.

వెనుకబడిన ప్రాంతాల నుంచి వచ్చిన ఆయన అచ్చమైన తెలంగాణ పదజాలంతో తన కవిత్వానికి రంగులద్దారు. నిత్య నూతన వస్తువులను సాహిత్యంలో ప్రతిబింబిస్తూ, ప్రజల ఆవేదనలను అక్షరాలుగా మలిచారు. తెలంగాణ మహోద్యమం, ఉద్యమ ఉధృతిని ఒక్క దీర్ఘ కవితలో అక్షరీకరించారు. బహుజనులంతా ఏకమై పిడికిలి బిగించి పోరాడిన ఆవేశం, సీమాంధ్ర పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన ఉద్యమ స్వరం ఆయన కలానికి బలమైంది. తెలంగాణ ఉద్యమం ప్రపంచానికే దిక్సూచిగా నిలిచింది. అలాంటి ఆత్మ ప్రతీక, తెలంగాణ ఉద్యమ స్వరంగా నిలిచిన దీర్ఘ కవిత "వొల్లెడ". ఇది తెలంగాణ గుండె చప్పుళ్ల ప్రతిధ్వని. తెలంగాణ ప్రజల పోరాటం, వారి ఉత్సాహం, ఆవేదన, ఆశయాలను కలగలిపిన స్ఫూర్తిదాయక దీర్ఘ కవిత. ఆయన అనుభవాలను, ఆలోచనలను నిక్షిప్తం చేయడం "వొల్లెడ" అనే దీర్ఘ కవితలో మనం చూస్తాం. సుబ్బయ్య గారు చూసిన ప్రతి సంఘటన, అనుభవించిన ప్రతిక్షణం, తెలంగాణ ప్రజల ఆర్తనాదాలు, పోరాటపటిమను కవిత్వ రూపంలో తడుముతారు.

తెలంగాణ సంప్రదాయంలో "వొల్లెడ" అనేది శుభానికి చిహ్నం. పెళ్లి సందర్భంలో అవిరేణి కుండలను మోసుకొచ్చే వారు, పైభాగంలో చెద్దరును గొడుగులా పట్టుకొని రక్షిస్తారు. ఆ చెద్దరు కింద కుండలతో పాటు ఉన్న వారంతా ఒకటిగా కదలడం, ఒకే లక్ష్యానికి నడవడం ఐక్యతకు ప్రతీక. మరో విధంగా చూస్తే జల్లెడ పట్టడం అనే జన నానుడులు పల్లెటూర్లలో చూస్తాం. ఈ సంప్రదాయ దృశ్యాన్ని కవి ప్రతీకగా ఎంచుకొని తెలంగాణ ఉద్యమాన్ని అల్లిండు. వొల్లెడ కింద చేరిన సకల జనులు, తెలంగాణ మహోద్యమంలో కూడ ప్రజలు ఒకే తాటిపై నడిచారు. సుబ్బయ్య గారి ఆలోచనల్లో, ఆ వొల్లెడ కింద నడిచిన బహుజనులందరూ ఏకమై ఈ మహోద్యమంలో భాగస్వాములైన విధానాన్ని శిల్పంగా చెక్కుతారు. బహుజనుల ప్రతి అడుగు పోరాటానికి బలమైంది, వారి ప్రతి నినాదం ఉద్యమానికి ఊపిరి నింపింది. "వొల్లెడ" దీర్ఘ కవితలోని ప్రతి పదం ఒక ఆర్తనాదం, ఒక ఆవేశం, ఒక ఆక్రోశం. తెలంగాణ ప్రజల గుండె చప్పుళ్లే అక్షరాలుగా మారాయి. ఈ కవితలో సుబ్బయ్య గారు చూపిన ప్రతీక "సబ్బండ వర్గాల ఐక్యత". ఆ ఐక్యతే ఉద్యమానికి పటిష్టమైన వెన్నెముక అయింది.



ఈ దీర్ఘ కవితలో...

"**తుఫాను వచ్చినా తూటాలు కురిసినా**
**ఈదులు తాళ్లు గీసినట్లే**
**అసెంబ్లీ మీద జెండా ఎగరేస్తాం**
**అడ్డొచ్చే జలగల తిత్తులు**
**తీస్తామంటున్న మోకులు**" అంటూ సబ్బండ వర్గాల ఐక్యతను ధైర్యంగా పోరాడే స్వాభావికతను ప్రతీకాత్మకంగా చిత్రిస్తారు. తెలంగాణ ప్రజల దృఢ సంకల్పాన్ని, అన్ని వర్గాల ఐక్యత భావాన్ని, లక్ష్యసాధనను ప్రతిబింబిస్తారు. తెలంగాణ పల్లెలు జీవించే మట్టి బిడ్డలందరూ ఏకమై పెత్తందారులపై చేసే యుద్ధానికి రంగులు అద్దారు.

"**పొద్దెక్కినట్లే**
**పోటెత్తుతున్న జనం**
**అంబట్యాలకే ఉద్యమ వాగిడి**
**సకలజనుల సమ్మె**
**సాలులోతు ఉద్యమం**
**కమ్మటి మట్టి వాసన**" అంటూ విశ్లేషణాత్మకంగా, సృజనాత్మకంగా పాఠకుని గుండె లోతుల్ని తడుముతారు. ఇక్కడ కవి మంచి ప్రతీకలతో, ఉపమానాలతో ఉద్యమ ఉధృతిని, ప్రజల ఆకాంక్షను స్పృశిస్తారు. యావత్ తెలంగాణ మొత్తం ఏకతాటిపై ఉన్న పోరాటా పటిమను దృశ్యామానంగా చెక్కుతారు. మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 42 రోజుల సకల జనుల సమ్మె ప్రజాసముద్రం లాంటి మహోఘట్టం. గువ్వ గూడు, చెట్టు చేమ, అక్షరాస్యులు నిరక్షరాస్యులు, సబ్బండ వర్గాల ఐక్యత తో అందరూ ఒక్కటై "మనది మనకే కావాలి" అనే బావుటా ఎగరేస్తారు. ఇది సమ్మె సమ్మెట చప్పుళ్లతో అస్తిత్వ సాధన కోసం చేసిన మహోత్మక యజ్ఞం.

"**ఆకలి మనది**
**అమృతం వాళ్లది**
**బతుకుపోరు మనది**
**బలుపు పోరు వాళ్ళది**
**త్యాగం మనది**
**కుర్చీలు వాళ్ళవి .....శవాల మనవి ...ప్యాలెస్లు వాళ్లవి**" అంటూ ఈ పాదాలలో ప్రాసా వైభవం, శిల్ప సౌందర్యంతో, ఉద్యమ కఠిన సత్యాలను గుండెను తడిమేలా చెక్కుతారు. ప్రతి పాదం ఒక పదునైన కత్తిగా ఉంది. ఇక్కడ సుబ్బయ్య గారు శ్రీకృష్ణ కమిటీ నివేదిక వెనక ఉన్న ముసుగు నిజస్వరూపాన్ని వెలికితీయడం, రాజకీయాల లొసుగులను అద్దం పట్టడం, తెలంగాణ ప్రజల ఆవేదనను మనసుకు హత్తుకునేలా ప్రతిబింబించడం చేస్తారు. తెలంగాణ ప్రాంత ప్రజల చరిత్ర, బాధ, ఆవేశం, తిరుగుబాటు అన్నీ కలిపిన ఒక గాఢ ప్రతీక.

చివరగా కోసమేరుపుతో ఈ కవితను ముగిస్తారు.

"**సకల జనుల సమ్మె**
**సర్వజనుల సమ్మె**
**సమ్మె మీద సమ్మె**
**తెగదెంపులు జరిగేదాకా**
**తెలంగాణ వచ్చేదాకా**
**ఎడతెగని సమ్మె!**" అంటూ ప్రజల్లో చైతన్యరథాన్ని, ఐక్యత బలాన్ని పురికొలుపుతారు. తెలంగాణ ఉద్యమ విశాలత్వాన్ని ధ్వనింపచేశారు. ఇది ఒక వర్గం, ఒక వృత్తి, ఒక వయస్సు గలవారి ఉద్యమం కాదు. ప్రతి వర్గం, కూలీ, కౌలుదారుడు, విద్యార్థి, ఉపాధ్యాయుడు, ఉద్యోగి, బహుజనుల అందరినీ ఏకం చేసి తమ హక్కులను సాధించేదాక మడమ తిప్పని ఆత్మవిశ్వాసాన్ని ప్రజల ఆకాంక్షను అక్షర బద్ధం చేస్తూ, ఆవేశాన్ని వ్యక్తం చేస్తారు.

ఈ కవిత్వ పాదాలను చదువుతున్నప్పుడు ఉరకలు వేస్తున్న తెలంగాణ ప్రజల ఆకాంక్ష, అస్తిత్వ పోరాటం, ఐక్యత బలం ఎంత మహోన్నతంగా ఉందో కళ్ళ ముందు కదలాడుతున్నట్టుగా చూపిస్తారు. చదువుతున్న పాఠకున్ని పక్కదోవ పట్టకుండా నేరుగా, సూటిగా, స్పష్టంగా హృదయాలను హత్తుకునే అక్షరాలను అక్షరబద్ధం చేస్తారు. ఇది వనపట్ల సుబ్బయ్య గారి కలానికున్న ప్రత్యేకత. వొల్లెడ వొడవకుండ తనువంతా తడిపే శక్తి ఈ దీర్ఘకవిత్వానికి ఉంది అనిపించింది. అక్కడక్కడ దీటుగా, ధైర్యంగా, శత్రువులకు సైతం సమాధానం చెప్పే అక్షరాలను ఆయుధంగా చేసుకొని మంచి ఆర్ద్రత, కోస మెరుపులతో ముగిస్తారు.



కంచర్ల మహేష్
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల
హుజూర్నగర్
6300489220

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 25.04.2026
www.mudranews.in | @mudranews



**వేసవిలో మద్యం తాగితే..**



వేసవిలో మద్యం తీసుకుంటే తల తిరగడం, బలహీనంగా అనిపించడం ఎక్కువగా ఉంటుంది.

# మూడో రోజుకు చేరిన సమ్మె

సమ్మెకు విపక్షాల మద్దతు | డిపోల వద్ద ధర్నాలు | పోలీసు బందోబస్తు















**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులపై సాగిస్తున్న అణచివేత చర్యలను బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బస్ డిపో వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో బీఎస్పీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ జోన్ ఇంచార్జ్ పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ (అడ్వకేట్), మాజీ జిల్లా ఇంచార్జ్ సి. కళ్యాణ్ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా డిపోల ముట్టడి, మిలియన్ మార్చ్ తరహా ఉద్యమాన్ని చేపడతామని బీఎస్పీ నేతలు హెచ్చరించారు. సమ్మెకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సూచన మేరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంఘీభావం ప్రకటించాయి. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటానికి బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాగం శశిధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చెవ్వ ప్రమోద్ కుమార్, రాజేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, చందు, శ్రీనాథ్ గౌడ్, కృష్ణ, పర్వతాలు, పరుశరామ్, శివ, గణేష్ పాల్గొన్నారు.

**గద్వాలలో..**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** సమ్మె నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ డిపో వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆర్టీసి కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. గద్వాల ఆర్టీసి డిపో నుంచి అన్ని ప్రాంతాలకు బస్సులు పాక్షికంగా నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు యథావిధిగా సేవలు అందిస్తుండటంతో ప్రయాణికులకు కొంత ఉపశమనం లభించింది. గద్వాల డిపోల నుంచి 60 ఆర్టీసి బస్సు సర్వీసులను తిప్పారు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసుహన్మంతు నాయుడు అన్నారు. నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, వెంకటేశ్వర రెడ్డి,అల్లపాడు ప్రతాప్,పటేల్ జనార్దన్ రెడ్డి,కోటేష్,మోనేష్,కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్,గువ్వల గోపాల్,చిత్తరి కిరణ్,మోహన్ యాదవ్,కమ్మరి రాము,గంజిపేట రాజు,కురవ పల్లయ్య,జాంపల్లి భరత్ సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిలర్లు, నాయకులు, సీపీఐ నాయకులు అంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్‌లో..**

**ముద్ర, కాప్రా:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెలో భాగంగా ఉప్పల్ డిపో ఎదుట ధర్నా కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ధర్నాలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, మల్కాజ్గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి రాష్ట్ర పాలనలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, పరిస్థితులు అటవీ రాజ్యాన్ని తలపిస్తున్నాయని వ్యాఖ్యానించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**నారాయణపేటలో..**

**ముద్ర, నారాయణపేట:** నారాయణపేట ఆర్టీసీ డిపో పరిధిలో మూడో రోజు సమ్మెలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కు నివాళి అర్పించారు. ఆర్టీసీ డిపో నుంచి సత్యనారాయణ చౌరస్తా పాత బస్టాండ్ నుంచి తిరిగి బస్టాండ్ వరకు మౌనంగా నిరసన ర్యాలీ చేపట్టి నివాళులు అర్పించారు.

## సంక్షిప్తంగా..

### కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గద్వాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుర్వ హన్మంతు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ మల్లేష్ గౌడ్, కేటీదొడ్డి సర్పంచ్ నారాయణ, ఏపీఎం చంద్రశేఖర్, ఏఈఓ మమత, సీసీ మద్దిలేటి, మండల అధ్యక్షులు ఉరుకుందు పాల్గొన్నారు.

### ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్. మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఆయనను అభినందించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు నేతృత్వంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ ఎన్నికల లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు 2 సీసీఎల్‌లు మంజూరు చేయాలని, రెండవ శనివారం, ఆదివారం విధులు నిర్వహించిన వారికి ప్రత్యామ్నాయ సెలవులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రమేష్, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, పూర్వాధ్యక్షుడు ఎస్. మురళి పాల్గొన్నారు. అలాగే జిల్లా నాయకులు కరుణాకర్ రెడ్డి, మండల బాధ్యులు బాలస్వామి, సురేష్ బాబు, శేఖర్, నరసింహ హాజరయ్యారు.

### విద్యార్థుల శుభ్రత ర్యాలీ



**ముద్ర, కాప్రా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈసీఐఎల్ సాయి సుధీర్ డిగ్రీ ,పీజీ కాలేజ్ విద్యార్థులు "ఎర్త్ వీక్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కుషాయిగూడ డివిజన ఏపీఐఐసీ కాలనీ పరిధిలోని పలు వీధులు, ప్లే గ్రౌండ్లను విద్యార్థులు శుభ్రపరిచి ప్లాస్టిక్ చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, ఎస్.ఎఫ్.ఏ వసంత, సంజీవ్, శిరీషతో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవం

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** సత్య సాయి బాబా 15వ ఆరాధన దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించినట్లు శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు హకిం విశ్వప్రసాద్ తెలిపారు. అభిషేక పూజలు, భజనలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. ఆరాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు హకిం మురళి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. రోహిత్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య ప్రారంబించారు.

# అంగన్వాడీ సేవల్లో సాంకేతిక విప్లవం



**ముద్ర, తాండూర్:** అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లను అందజేసిన అనంతరం మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ ద్వారా మరింత పారదర్శకంగా, ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేసే వీలు కలుగుతుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అంగన్వాడీ టీచర్లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందన్నారు. అంగన్వాడీ సిబ్బంది సేవలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల అభివృద్ధి, మహిళల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో, డిజిటల్ సేవలు అందించడంలో టీచర్లకు మరింత సౌలభ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, ఏఎంసి చైర్మన్లు నర్సింలు, వైస్ చైర్పర్సన్ అబ్దుల్ రజాక్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, అంజయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఐ సి డి ఎస్ అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు , అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సహాయ నిధి.. పేదల పెన్నిధి**

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 175 మంది లబ్ధిదారులకు దాదాపుగా రూ. 65,00,000 విలువ గల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్లో ఇబ్బందులు ఎదుర్కొన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వచ్చే సహాయనిది నుండి పేద ప్రజలకుఎంతో మేలు జరుగుతుంది అని పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**ముద్ర మల్కాజ్గిరి:** ఎస్సీ, ఎస్టీ వర్గాల యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.సైనిక్‌పురిలో నేషనల్ ఎస్సీ ఎస్టీ హబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంటర్ప్రెనర్స్ అవేర్నెస్ అండ్ మార్కెటింగ్ ప్రోగ్రాం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ తీసుకువచ్చిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని, విద్య మరియు వైద్య రంగాల్లో ముందంజలో ఉండి ఆర్థికంగా బలపడాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మార్పుకు దారితీస్తాయని ఆయన పేర్కొన్నారు. వ్యాపారం కేవలం ఆదాయం కోసం మాత్రమే కాకుండా స్వాభిమానాన్ని పెంచే సాధనమని, ఆత్మ నిర్భరతకు మార్గమని అన్నారు.యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, బ్యాంకులు, మరియు వివిధ సంస్థలు యువ పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎస్సీలకు అందాల్సిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎస్ఐసీసీ తెలంగాణ ఎస్సీ ఎస్టీ అధ్యక్షుడు నల్ల బాబు, జోనల్ మేనేజర్ సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్‌హెచ్ఓ సురేష్, జిల్లా ఎల్‌డీఎం మేనేజర్ శివప్రసాద్, ఏ.డి. జయంతి, లంబోధర్ మిశ్రా (ఏజీఎం–ఎస్ఎంఈ), వెంకటేశ్వరరావు, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఈనాడు కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డి నగర్, మెడికల్ సొసైటీ కాలనీలలో రూ.1.16 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే యూజీడీ నిర్మాణం పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు జలమండలి అధికారులు మరియు తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అన్నారు. ఈనాడు కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డి నగర్, మెడికల్ సొసైటీ కాలనీల లో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి శంకుస్థాపనలతో పరిష్కారం అవుతుందన్నారు. ఈనాడు కాలనీ లో రూ.39.80 లక్షలు, రిక్షా పుల్లర్స్ కాలనీ లో రూ.8.20 లక్షలు, పాపిరెడ్డి నగర్ కాలనీ లో రూ.21.00 లక్షలు, మెడికల్ సొసైటీ కాలనీ లో రూ.47.60 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే యూజీడీ నిర్మాణం పనులకు అరికపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, జీఎం హరిశంకర్, డిజిఎం శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్ మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్‌లో రైతుల రాస్తారోకో



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా నెల్లికొండ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. రహదారిపై పెద్ద సంఖ్య లో రైతులు బైఠాయించి ఆందోళన చేయడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నెల్లి కొండ మార్కెట్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకుడు నాగం శశిధర్ రెడ్డి రైతులతో కలిసి పాల్గొని వారికి మద్దతు తెలిపారు.రైతులు తెలిపిన వివరాల ప్రకారం, కొనుగోలు చేసిన వరి ధాన్యం గత 15 రోజులుగా మార్కెట్ యార్డులోనే నిల్వ ఉండి, ఇంకా తరలింపు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం తరలింపులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆరోపించారు.తక్షణమే నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


# పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత

**ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా**



**ముద్ర, మల్కాజిగిరి:** పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యత అని ఎమ్మెల్సీ బొగ్గవరపు దయానంద్ గుప్తా తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఎన్విరాన్‌మెంట్ సర్వీస్ వీక్" స్వచ్ఛతా కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పరిసరాల సమాజంలో అవగాహన పెంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. స్వచ్ఛతను కాపాడేందుకు ప్రజలు పాటించాల్సిన ఐదు ముఖ్య సూత్రాలను ఆయన వివరించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో ఎరువు తయారు చేయడం, బహిరంగ మూత్ర విసర్జనను నివారించడం, ప్లాస్టిక్ బ్యాగుల బదులు జ్యూట్ లేదా క్లాత్ బ్యాగులను వినియోగించడం, చెత్తను నాలాలు లేదా బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నిరోధించడం, చెత్తను కాల్చకుండా గాలి కాలుష్యాన్ని నివారించడం వంటి అంశాలను పాటించాలని సూచించారు. అలాగే "స్వచ్ఛ సర్వేక్షణ్–2026"లో మన జిల్లాను నంబర్ వన్ స్థానంలో నిలపడం లక్ష్యమని, ఇందుకోసం ప్రతి పౌరుడు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసి ఆచరణలో పెట్టాలని కోరారు.ఇదిలా ఉండగా, ఏప్రిల్ 26న జిల్లా స్థాయిలో మెగా పర్యావరణ ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛతపై విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు లయన్స్ ఎన్విరాన్‌మెంట్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ అన్నెం కోటిరెడ్డి తెలిపారు.

# ఆర్య,వైశ్య సంఘం నాయకుల హర్షం




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తూ నాగర్ కర్నూల్‌లో ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ గాంధీ పార్క్‌లో స్థానికంగా అమ్మవారి చిత్రపటంతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల భావోద్వేగాలకు గౌరవం దక్కిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, సమాజంలోని అన్ని వర్గాలకు సమాన గౌరవం ఇచ్చే దిశగా ఇది ఒక మంచి అడుగని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, హరిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉజ్వల్ మహేష్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సంబు పాండు, అల్లంపల్లి శ్రీనివాసులు, సాయి శేఖర్, దివి నారాయణ, సాయి రాజా మరియు ఆర్యవైశ్య మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 25.04.2026
www.mudranews.in | @mudranews



**వేసవిలో మద్యం తాగితే హృదయంపై ఒత్తిడి**

మద్యం వల్ల గుండె వేగం పెరుగుతుంది. వేసవి వేడి కూడా కలిసి వస్తే హార్ట్‌పై డబుల్ ఒత్తిడి పడుతుంది.



# వాణిజ్య పంటలు సాగు చేయాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కోరుట్ల, ముద్ర:**
రైతులు వాణిజ్య పంటలను సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలంలో పర్యటించారు. తండ్రియాల, భూషణ్ రావు పేట, సిరికొండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో, దుంపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం దుంపేటలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరగా గ్రేడ్-ఏ రకానికి రూ.2389 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మెరుగైన విత్తనాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులకు ఒకే సారి రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. సన్న వడ్లు పండించే రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. పంట పొలాలు ఎండిపోకుండా ఉండేందుకు ఎల్లంపల్లి నీటిని మూడు సార్లు విడుదల చేసినట్లు చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన సూచించారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే జిల్లా కేంద్రంలోని గోదాములను వినియోగిస్తామని తెలిపారు. మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇక రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. మన ప్రాంతంలోని రైతులకు సిద్దిపేట నర్మెట్ట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వం ట మార్పిడి విధానాన్ని అనుసరించాలన్నారు. విప్ వెంట కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు కాయితీ నాగరాజు, మార్కెట్ కమి టీ చైర్మన్ పుంద్ర నారాయణ రెడ్డి, చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు సంయమనం పాటించాలని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ప్రతిపక్షాల మాయలో పడి జీవితాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల ఆందోళనపై మంత్రి జూపల్లి ఆరా తీశారు. అనంతరం ఆయన ఓ విడుదల చేసిన ప్రకటనలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంద ని పేర్కొన్నారు. వారి సమ్మెను విరమింపజేసి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆందోళనను ఉక్కు పాదంతో అణిచివేసిన చరిత్ర గత ప్రభుత్వానిదని విమర్శించారు. ఆనాడు 55 రోజుల పాటు సమ్మె జరిగినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదన్నారు. 36 మంది ఆర్టీసీ కార్మికులు మరణించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చలించలేదని విమర్శించారు. సమ్మె అంటే డిస్మిస్ అని నాటి పాలకులు హెచ్చరించారని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు.

## కలెక్టర్ ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అంకం మౌనిక శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు పూలమొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చైర్‌పర్సన్ సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పారపు సత్యవతి, గుమ్మల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

**- కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**ముద్ర, కోరుట్ల:**
ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్పష్టం చేశారు. కథలాపూర్ లో శుక్రవారం ఉపాధిహామీ పథకం పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పను ల్లో కూలీల సంఖ్య పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మరి కొంత మంది కూలీలను ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఆర్డీవో రఘువరన్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఈసీ లు, టీఏ లు, కంప్యూటర్ ఆపరేటర్ లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

**జన గణన కీలకం..**

జన గణన ప్రక్రియ దేశాభివృద్ధికి కీలకమని కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో జన గణన లో పాల్గొనను న్న ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. ఖచ్చితమైన గణాంకాలు సేకరించాలని పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

**- ఎమ్మెల్యే సత్య నారాయణ రావు**




**మహాదేవపూర్, ముద్ర:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో యాసంగి రబీ ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అథితిగ హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రవాణాకు లారీలు అందు బాటు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీడ, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యా కెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫ రాల సంస్థ డీఎం రాములు, సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియ నాయక్, డీఆర్డిఓ బాలకృష్ణ, వ్యవ సాయ అధి కారి బాబురావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రవాణా శాఖ అధికారి సంధాని, తూనికల కొలతలు, కార్మిక శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రా క్టర్లు, కేంద్రాల ఇంచార్జీలు పాల్గొన్నారు.

**పారదర్శకత కోసం స్మార్ట్ ఫోన్లు ..**

అంగన్ వాడీ సేవలను మరింత పారదర్శకంగా చేసేందుకు టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్ వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంధాలయ సంస్థల చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లీశ్వరి, ఆర్టీఐ సభ్యులు రాంచంద్రయ్య పాల్గొన్నారు.

# జన గణనను పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ రాజర్షి షా**




**బోథ్, ముద్ర:**
జిల్లాలో జన గణన-2027 ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ టీటీడీసీ కేంద్రంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన రెండో దశ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. జనగణన ప్రక్రియలో భాగంగా హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ పనులను లోపాలకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈసారి జనగణనను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణ కోసం 'సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఆధునిక యాప్‌లు, పోర్టర్లను వినియోగంలోకి తెచ్చినట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించడం ద్వారా గణాంకాల్లో ఖచ్చితత్వం పెరుగుతుందని, పొరపాట్లు నివారించవచ్చని పేర్కొన్నారు. జనగణన నమోదు ప్రక్రియను రెండు విడతల్లో చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం అధికారులకు జనగణన కిట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## నేడు చండీగఢ్ కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**- చింతన్ శివిర్ లో పాల్గొననున్న మంత్రి**



**ముద్ర, ధర్మపురి:** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ నెల 25న చండీగఢ్ కు వెళ్లనున్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న చింతన్ శివిర్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 7-30 గంటలకు మంత్రి బయలురుతారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంక్షేమ శాఖ మంత్రులతో పాటు న్యాయ శాఖ మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తెలంగాణ తరపున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించనున్నారు. మంత్రి పర్యటన దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చండీగఢ్ ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. చండీగఢ్ పర్యాటక ముగించుకొని ఈ నెల 28న తిరిగి మంత్రి హైదరాబాద్ చేరుకుంటారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**ముద్ర, కరీంనగర్:** నియోజకవర్గ పరిధిలోని చింతకుంటలో డీసీఎంఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ తో మాట్లాడి లైట్లను ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలను చేపట్టాలని అధికారులకు సూచించారు.

## జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నలుగురు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులను ఎన్నికున్నారు. కో ఆప్షన్ పదవులు నాలుగు మాత్రమే ఉండగా, 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ల ఆశీస్సులు ఉన్న నలుగురికి పదవులు దక్కాయి. వీరబత్తిని పద్మజ, గట్టు సతీష్, తస్లీం సుల్తాన, మహమ్మద్ అబ్దుల్ కదీర్ అలియాస్ ముజ్జు భాయి లను కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులను మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ స్పందన, సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అ ధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఆర్టీసీ కార్మికుల ర్యాలీ




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు శుక్రవారం పట్టణంలోని డిపో నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మాజీ మంత్రి, బీఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకుల మద్దతు



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణం లోని బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ కార్మికులు తమ హక్కు ల కోసం చేస్తున్న సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం ఆత్మ బలిదానం చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.5 కోట్లు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ తలపెట్టిన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పార్టీ వెన్నంటే ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వై. అనూఫ్ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ, నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుంటుక సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ నిర్వీర్యం..

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వంలో సహకార వ్యవస్థ నిర్వీర్యమైందని ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్ ల ఫోరం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జిల్లా పీఏసీఎస్ చైర్మన్ ల ఫోరం నాయకులు విలేకరుల సమాట్లాడుతూ సహకార వ్యవస్థకు రైతులే వెన్నుముక అని తెలిపారు సహకార వ్యవస్థలో నామినేటెడ్ విధానం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు పోయే దమ్ములేక నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను ఎన్నుకునే విధంగా క్యాబినెట్ తీర్మానించడం తగదన్నారు. పో పీఏసీఎస్ ల ఫోరం నాయకులు సాగర్ రావు, మహిపాల్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## వేసవిలో మద్యం తాగితే..

జీర్ణ సమస్యలువేసవిలో జీర్ణ వ్యవస్థ సున్నితంగా ఉంటుంది. మద్యం తీసుకుంటే అజీర్ణం, గ్యాస్ సమస్యలు పెరుగుతాయి.



## యువతను ఆదుకోవాలి




**ముద్ర, మోత్కూర్:** గ్రామాల్లో అనేక మంది యువత ప్రభుత్వం ద్వారా ఉపాధి లేక హమాలీ కార్మికులుగా మారుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ అన్నారు. శుక్రవారం పాటిమట్ల గ్రామంలో డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అధికారంలోకి రాగానే యూత్ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి డిక్లరేషన్ లో ఉన్న ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేయకుండా ప్రభుత్వం నిరుద్యోగ యువతతో చెలగాటమాడుతుందని వారన్నారు. గతంలో నిరుద్యోగ యువతను మోసం చేసిన ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కుర్మేటి రాజకుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు కాదు ప్రభుత్వ హత్యలే!




**ముద్ర, మోత్కూర్:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని బీజేపీ మోత్కూర్ మండల అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిని విలేకరుల సమావేశంలో మండల ఉపాధ్యక్షులు గుంటి సతీష్, నార్సింగ్ మహేష్, బండ నరసింహ, బండ నర్సిరెడ్డి, నాయిని ఉపేందర్, ఇట్టబోయిన ఆంజనేయులు, నల్ల పోగుల వెంకన్న, బత్తిని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కార్మికులను ఆదుకోవాలి

**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి:** కూలీలను ఉపాధి నుండి దూరం చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ విమర్శించారు. శుక్రవారం ఆత్మకూరు మండల పరిధి లోని కూరెళ్ల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల సమస్యలను తెసులుకున్నారు. 200 రోజుల పని దినాలు కల్పించి కూలీలను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేముల భిక్షం, మండల కన్వీనర్ తుమ్మలగూడెం యాదయ్య, గ్రామ ఉపసర్పంచ్ హనుమంతుల రమేష్, గ్రామ నాయకులు మరిపల్లి మల్లయ్య, బండ బీరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సుధా గాని యాదమ్మ, కార్మికులు నాగమణి, రమణ, నిర్మల, లక్ష్మీనరసమ్మ, మల్లమ్మ, ముత్తమ్మ, సోమమ్మ, సప్నా, బుచ్చమ్మ, పూలమ్మ, పద్మ, కవిత, మాధవి, మంగమ్మ, ఉపేంద్ర, చంద్రమ్మ, సుజాత, సిద్ధమ, లచ్చమ్మ, నరసమ్మ, పూలమ్మ, సునీత పాల్గొన్నారు.



## హైకోర్ట్ తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

**ముద్ర,మోత్కూరు:** కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పి సి ఘోష్ కమిషన్ నివేదిక అంత తప్పుల తడక అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోన్నేబోయిన రమేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో అంతులేని వ్యతిరేకత పెరిగిందని అన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు జంగ శ్రీను,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొనతం యాకుబ్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు కొండ సోం మల్లు,గజ్జి మల్లేష్, మాజీ సర్పంచి భయ్యాని పిచ్చయ్య, నాయకులు మర్రి అనిల్ కుమార్, దబ్బేటి శైలజ, మాజీ ఎంపీటీసీ పాముసుగుల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుట్ర బయట పడింది..



**ముద్ర, తుంగతుర్తి:** కాళేశ్వరం ప్రాజెక్టు పై విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర బయటపడిందని, హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర బయట పడిందని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపగాని రమేష్ తడకమళ్ళ రవికుమార్, ఉప్పల నాగమల్లు, గ్రామ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్, నల్లబెల్లి వెంకటేష్, కొండగడుపుల వెంకటేష్, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రతి ఒక్కరు ఏ రంగంలో నైనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విధ్యార్ది దశలో నే ఇది అలవాటు చేసుకోవాలని జిల్లా అడిషినల్ కల్లెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రణాళిక సంక్షేమ వారోత్సవం జిల్లా కల్లెక్టర్ సమీకృత కార్యాలయంలోని మీటింగ్ హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషినల్ (రెవెన్యూ) వెంకారెడ్డితో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఐటిఐ, ఏటిసి లోని వివిధ రకాల కోర్సులు ప్రతి ఒకటి జీవితంలో అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ లో టైలరింగ్, బ్యూటీషన్, కంప్యూటర్ వివిధ కోర్సులలో ట్రైనింగ్ పొంది సొంత ఉపాధి పొందాలన్నారు. జిల్లా అడిషినల్ కల్లెక్టర్ (రెవెన్యూ) వెంక రెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ప్రతి ఒక్క విద్యార్దిని విధ్యార్థులు వారి నైపుణ్యాని పెపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పి డి నాగిరెడ్డి, ఉపాధి కల్పన జిల్లా అధికారి సాహితి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి శ్యాంసుందర్, ఆలేర్ ఐటిఐ ప్రిన్సిపల్ హరికృష్ణ, జిల్లా యువజన, క్రీడల అధికారి కే.ధనంజనేయులు, శివరామకృష్ణ. అంజిరెడ్డి, డైరెక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్

**మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్పర్సన్ స్నేహ శబరీష్**



**మహబూబాబాద్, ముద్రప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లాలో మీడియా అక్రిడిటేయేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్పర్సన్ స్నేహ శబరీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా మీడియాఅక్రిడిటేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ స్నేహశబరీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ కు మర్యాదపూర్వకంగా మొక్కను అందజేశారు. నూతన కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీపీఆర్ఓ పి రాజేంద్రప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, ఈరగాని బిక్షం, వేముల అయోధ్యరామయ్య, నవాబ్, షేక్ అక్రం, ఎం మోహన్ రెడ్డి, గాడిపల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.



## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:** జిల్లా పోలీసు శాఖలో పని చేస్తూ మరణించిన ఏఎస్ఐ సత్యనారాయణ కుటుంబానికి రూ.10 లక్షల ఎస్బీఐ ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం జిల్లా ఎస్పి నరసింహ అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసులకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ ఇవ్వడం జరిగినదని, పోలీసు సిబ్బంది మరణించిన క్రమంలో ఈ పోలీస్ సాలరీ ప్యాకేజ్ అకౌంట్ ద్వారా రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అందిస్తుంది. ఈ స్కీం పోలీసు కుటుంబాలకు ఎంతగానో ఆర్థిక బాసటగా నిలుస్తుందని అన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది సాలరీ ప్యాకేజ్ అకౌంట్ గా మార్పు చేసుకోవాలని సూచించారు. ఈ స్కీం ను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఓ మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ఐ బెల్లంకొండ రామచందర్ గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మోహన్ కుమార్, మహేష్, సిబ్బంది ఉన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ఎన్.పీ.ఆర్.డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యమం చేయాలని ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్.పి.ఆర్.డి) యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు సూరపంగా ప్రకాష్ అధ్యక్షతన దుంపల మల్లారెడ్డి స్మరక భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అడివయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 28 నెలలు అవుతుందని, అసెంబ్లీ ఎన్నికలల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. పెన్షన్స్ పెంచకుండా ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తుందని అన్నారు. వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ మాట్లాడుతూ.. వికలాంగులకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నారు. మే 29-31 తేదీల్లో యాదగిరిగుట్టలో ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్లినం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి స్వామి, జిల్లా అధ్యక్షులు సూరపంగా ప్రకాష్, కార్యదర్శి వి ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె లలిత, జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్,ఆంజనేయులు, బర్ల పార్వతి, సహాయ కార్యదర్శులు శంకర్, శ్రీహరి,జిల్లా నాయకులు రజిత, పద్మ,లింగ్య నాయక్ దాసు పాల్గొన్నారు.




# శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో శుక్రవారం పురస్కరించుకొని శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనం, వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవ, శ్రీ సుదర్శన నారసింహ హవనంను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీవారి వైభవోత్సవ మండపంలో నిత్య కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవ, తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.



## శిక్షణ తరగతులకు.. మధుయాష్కి గౌడ్ కు ఆహ్వానం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుండి మే 2 వరకు నిర్వహించే సేవాదళ్ శిక్షణ తరగతులకురాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎం పి మధు యాష్కీని ఆహ్వానించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ గాంధీ భవన్ లో ఈ తరగతులు నిర్వహించనున్నారు. రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ నాయకత్వంలో రాష్ట్ర సేవ దళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్ ఆహ్వానించారు.

# కష్టపడే కార్యకర్తలకే గుర్తింపు..

- త్వరలో నామినేటెడ్ పదవులు
- ఎంపీటీసీ, జడ్పీ టీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- ఎమ్మెల్యే మందుల సామేలు



**ముద్ర, తుంగతుర్తి:** పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని, వారికే పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు దక్కుతాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అబ్జర్వర్ కొండేటి మల్లయ్య, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షుల ఎన్నిక సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కొండేటి మల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో మూడు సంవత్సరాలు పాటు పని చేసిన వారికి పార్టీ పదవులు ఇచ్చేందుకు అధిష్టానం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పిటీసీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూర్యాపేట జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు దరూరి యోగానంద చార్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, వివిధ మండలాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయబద్ధమైనదే

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ఆర్టీసీ కార్మికుల చేపట్టిన సమ్మె న్యాయబద్ధమైనదని ఆర్టీసీ కార్మికుల సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్ ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో ముందు జరుగుతున్న సమ్మెకు వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. డిమాండు పరిష్కరించే వరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని వారు అన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### వేసవిలో మద్యం తాగితే చర్మ సమస్యలు

మద్యం శరీరాన్ని డీహైడ్రేట్ చేసి చర్మం పొడిబారేలా చేస్తుంది. వేసవిలో ఇది మరింత తీవ్రంగా కనిపిస్తుంది.





## నిజాయితీగా పని చేస్తే విజయం సాధించవచ్చు

- **బాధితుల పక్షాన అడ్వకేట్స్ నిలబడాలి**
- **సిద్దిపేట బార్ అసోసియేశన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

నిజాయితీగా పని చేస్తే విజయం దానంతట అదే వరిస్తుందని సిద్దిపేట బార్ అసోసియేశన్ అధ్యక్షుడు రమేష్ బాబు, లీగల్ సెల్ అత్తారిటీ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు అన్నారు. మూట్ కోర్టు ప్రాజెక్టు లో బాగంగ వినాయక లా కాళశాల విద్యార్థులు శుక్రవారం సిద్దిపేట లొని కోర్టు లను సందర్శించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బార్ అసోసియేశన్ ప్రెసిడెంట్ రమేష్ బాబు మాట్లాడుతూ అడ్వకేట్స్ నిజాయితీగా పని చేయాలన్నారు. ఎక్కువ లాంగ్వేజ్లు నిర్చుకోవడం వల్ల, సబ్జెక్టు పై పట్టు సాధిస్తే కేసులను చాలా సులభంగా గెలవచ్చని సూచించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అత్తారిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్, ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు. డీఎస్ఎల్ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు విద్యార్థులకు చైల్డ్ ప్రొటెక్టన్, చైల్డ్ మ్యారేజ్ పై ఉన్న చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేశన్ కార్యదర్శి సదానందం,లా కళాశాల చైర్మన్ రాజు, వైస్ ప్రిన్సిపల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీమాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

వాసవిమాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షనీయమని సిద్దిపేట పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26 వ తేదీన వాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లొని హోసింగ్ బోర్డు లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుతామాన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద అన్నప్రసాద విచారణ కార్యక్రమం చేపడతామని, ఈ కార్యక్రమంలో వైశ్యలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు మధుసూదన్, సురేష్, పప్పు రవి, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

- **ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టికి తీసుకెళ్తాం.. రైతులకు అండగా ఉంటాం**
- **సిద్దిపేట అర్బన్ మండలంలో పంట నష్టపోయిన గ్రామాల్లో పర్యటించిన బీఆర్ఎస్ నాయకులు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి, కృష్ణసాగర్, పొన్నాల గ్రామాల్లో నిన్న కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు జరిగిన పంట నష్టం, తడిచిన ధాన్యాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అర్బన్ మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు యాదగిరి ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న కురిసిన అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, ఆందోళనలో ఉన్న రైతులను కలిసి మనోధైర్యం ఇచ్చారు. చేతికొచ్చిన పంట నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని హరీష్‌రావు గారి దృష్టికి తీసుకెళ్లామని, అధికారులతో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక పంపాలని వారు కోరారు. అదేవిధంగా రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్సాన్‌పల్లి, పొన్నాల గ్రామాల్లో తడిచిన వరి ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలని, ప్రతి గింజను కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగుల ప్రశాంత్ గౌడ్, నరేందర్, వెంకటయ్య, నాయకులు నర్సయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

- **జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని మెదక్ జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ కార్మికులు మెదక్ గుల్షన్ క్లబ్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. టీఎన్జీవో నాయకులతో పాటు జేఏసీ భాగస్వామ్య సంఘ నాయకులు విట్టల్, రాజ్‌కుమార్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, శివయ్య, శ్రీహరి గౌడ్, ప్రసాద్, మెప్మా సునీత, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి "శంకర్ గౌడ్ అమర్ హై" అంటూ నినాదాలు చేస్తూ కొవ్వొత్తులు, పూలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికై ఎన్నో దఫాలుగా యాజమాన్యానికి, ప్రభుత్వానికి విన్నవించారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి సరైన గౌరవం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయని అన్నారు. ఎండనక, వాననక, రాత్రనక, పగలనక విధి నిర్వహణలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా రోడ్డు రవాణా సంస్థను కాపాడుకునేందుకు కార్మికులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని వారి సేవలను గుర్తు చేశారు. 2021 నుండి వేతన సవరణ విధానాల్లో ఉన్నదని, కార్మిక సంఘాల పునరుద్ధరణ ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల హక్కులను ఆర్థిక భారం గా చూడకుండా ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా రవాణాను ఆర్థిక అంశాలతో పోల్చొద్దని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీలను విధిగా పాటిస్తూ ప్రజా రవాణా నిర్వహిస్తున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు గౌరవం కల్పిస్తూ ఉచిత రవాణా అమలులో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ముఖ్యంగా మహిళ కండక్టర్లు బస్సులు నిండిన ప్రయాణికుల ఒత్తిడితో సతమతమవుతున్నప్పటికీ విధి నిర్వహణను సమర్థంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, వారు చేస్తున్న ఉద్యమానికి అన్ని వర్గాల ఉద్యోగుల అండ సంపూర్ణంగా ఉంటుందన్నారు. శంకర్ గౌడ్ వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడి వారితో చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజాలుద్దీన్, రఘునాథ్ రావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సలావుద్దీన్, ప్రశాంత్, శ్రీపాల్ రెడ్డి, సలీం, రిజ్వాన్ అలీ, సిపిఎం నాయకులు మల్లేశం, బాలమణి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదల సొంత ఇంటి కల సాకారం

- **ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పక్కాగా, పారదర్శకంగా జరుగుతుందన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. విడతలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందులో 650 ఇండ్లు గృహప్రవేశాలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, సర్పంచ్ వినీత, అధికారులు పాల్గొన్నారు.

**యువత నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి**

మారుతున్న కాలానికి అనుగుణంగా యువతకు తాము ఎంచుకున్న రంగాలలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధ్యపడతాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల నుంచి ఇంటర్మీడియట్ ,డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు నైపుణ్య అభివృద్ధి, స్వయం ఉపాధి పథకాల అమలుపై డిఆర్డిఓ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రకాష్ రావుతో కలిసి యువతకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... యువతకు సాంకేతిక, వ్యవస్థాపక నైపుణ్యాలలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసిందని మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచానికి దీటుగా నిలబడాలంటే కంప్యూటర్ కోర్సులలో ప్రతిభావంతులై ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువత లబ్ధి పొందాలన్నారు. అంతకుముందు ఐటీసీ సంస్థ నుండి ప్లాంట్ మేనేజర్ ఆనంద్, టెక్నీషియన్ శివయ్య నైపుణ్యత శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందే విధానంపై సమగ్రంగా వివరించారు. ఐ.టీ.సీ సంస్థలో 50 ఉద్యోగాలున్నాయన్నారు.

## ఎస్పీని కలిసిన కొత్త ఏఎస్పీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:**


మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ కుమార్ సింగ్ (ఐపీఎస్) శుక్రవారం ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు (ఐపీఎస్)ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర సేవలందజేత, పోలీస్ శాఖ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ 36వ బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవము, సాయంత్రం స్వామివారి ఊరేగింపు సేవ నిర్వహించబడునని ఆలయ వంశానిగత ధర్మకర్త కంచి మధుసూదన్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# మహిళల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**
- **మహిళా బిల్లుకు అడ్డంకులు సృష్టించిన కాంగ్రెస్‌పై బీజేపీ మండిపాటు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



మహిళలు ఆర్థిక రాజకీయ సామాజిక అంశాలలో ముందుండాలనే ఉద్దేశంతోటి కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ తీసుకువచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం సిగ్గుచేటని సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. సుమారు 50 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ మహిళల సంక్షేమం కోసం ఏనాడు పాటుపడకపోగా రాజ్యసభలో మహిళా బిల్లు చేసి లోక్సభలో వీగిపోయేలా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీని ఆమె మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి మహిళల అభివృద్ధి కోసం పాటుపడుతుందని ఆమె తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్క్లబ్లో నారీశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడారు. పుట్టబోయే బిడ్డను పురిటిలోనే తుంచి వేసినట్టు ఇండి కూటమి మహిళా బిల్లును పాస్ కాకుండా అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని ఆమె విరుచుకుపడ్డారు. భారతీయ జనతా పార్టీ మైనారిటీలకు వ్యతిరేకమని కాంగ్రెస్ కూటమి ఎన్నో రకాలుగా దుష్ప్రచారం చేసినప్పటికీ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం త్రిబుల్ తలాక్ ను రద్దు చేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛ వాయువులను ఇచ్చిందని ఆమె గుర్తు చేశారు. పేద మహిళలకు జన్ధన్ ఖాతాలను తెరిచి, ఆడపిల్లలు జన్మిస్తే పేటి పడావో బేటి బచావో, సుకన్య సమృద్ధి యోజన పథకాలను తీసుకువచ్చి వారికి అండగా నిలిచిన ఘనత ప్రధాన నరేంద్ర మోడీ అన్నారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పల ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇర్రి ఉమా రెడ్డి, పట్టణ అధ్యక్షులు బాసాంగారి వెంకట్ , సంతోష్, తొడుపునూరి వెంకటేశం పలువురు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## వేసవిలో మద్యం తాగితే నిద్రలేమి



మద్యం తాత్కాలికంగా నిద్రలా అనిపించినా, నాణ్యమైన నిద్రను దెబ్బతీస్తుంది. వేసవిలో ఇది మరింత ఇబ్బంది కలిగిస్తుంది.



## ఆత్మహత్యలకు పాల్పడవద్దు

- ఆర్టీసీ సమ్మెకు ఎంపీ ఈటల సంఘీభావం

**ముద్ర, మల్కాజిగిరి:**

ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, వారి పోరాటానికి సమాజం అండగా నిలవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు హకింపేట డిపో వద్ద ఆయన సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో రద్దీ పెరిగి డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం మంచిదే అయినా సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, తక్కువ జీతాలతో జీవనం కష్టమైందని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల దోపిడీని ఆపాలని, ఆర్టీసీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రవాణా శాఖ మంత్రి ముందస్తు నోటీసులు ఉన్నప్పటికీ స్పందించకపోవడం సరైంది కాదని, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల మృతి చెందిన శంకర్ గౌడ్‌కు నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

## డెంటల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఎమ్మెల్యే కూచుకుళ్ల

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



తెలంగాణ రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి దేశ స్థాయిలో మరో ముఖ్య బాధ్యతను అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ డెంటల్ కమిషన్ చట్టం, 2023 కింద ఏర్పాటు చేసిన డెంటల్ అడ్వైజరీ కౌన్సిల్ లో సభ్యుడిగా ఆయనను నియమించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి నిపుణులు, అధికారులు ఈ కౌన్సిల్‌లో భాగమవుతుండగా, తెలంగాణ రాష్ట్రం తరఫున డా. రాజేష్ రెడ్డి కి ఈ అవకాశం దక్కడం విశేషంగా భావిస్తున్నారు. ఆయన ఇప్పటికే రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సేవలందిస్తూ, వైద్య రంగంలో తన ప్రతిభను చాటుతున్నారు. ఈ నియామకం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందని, రాష్ట్రంలోని డెంటల్ విద్య, వైద్య సేవల అభివృద్ధికి దోహదం చేస్తుందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి
ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

## మైనర్ లైంగికంగా వేధించిన నిందితునికి 10 ఏళ్ల జైలు

**ముద్ర, కూకట్‌పల్లి :**

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ఒక చిన్నారుల లైంగిక వేధింపుల కేసులో నిందితునికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. శుక్రవారం కూకట్‌పల్లిలోని పోక్సో ప్రత్యేక కోర్టు ఈ మేరకు తీర్పు వెల్లడించింది. పోలీసుల కథనం ప్రకారం 2017లో బాలానగర్ పి.ఎస్ పరిధిలో నమోదైన ఈ కేసులో శేఖ్‌పేట ప్రాంతానికి చెందిన కొర్ర శివశంకర్ అలియాస్ రాజు (41) నిందితుడు. కూలీ పనులు చేసుకునే ఇతను ఒక బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి, బంధించినందుకుగాను పోలీసులు అప్పట్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కూకట్‌పల్లిలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు ఇన్చార్జ్ న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు ఈ కేసును సుదీర్ఘంగా విచారించారు. నిందితుడిపై మోపబడిన నేరాలు నిరూపితం కావడంతో ఆయన విధంగా శిక్షలు ఖరారు చేశారు. పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా,సెక్షన్ 342 IPC కింద రూ.వెయ్యి జరిమానా. బాధితురాలికి ప్రభుత్వం తరపున రూ. 3లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. సంతోష్‌కుమారి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. నాటి దర్యాప్తు అధికారి పి. భిక్షపతి రావు, ప్రస్తుత బాలానగర్ ఎస్.హెచ్.ఓ టి. నరసింహ రాజు నేతృత్వంలోని బృందం సాక్ష్యాధారాలను పకడ్బందీగా సమర్పించారు.నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్ట్ డ్యూటీ అధికారులు పి. రాజ్‌కుమార్, కె. మధు, సమ్మన్స్ అధికారి మధు బాబు, బ్రీఫింగ్ ఆఫీసర్ హాజీ మియా, లైజన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో కొండాపురం వాసి మృతి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. కొండాపురం గ్రామానికి చెందిన సింహాద్రి (52) అనే వ్యక్తి రాత్రి జాంపల్లి గ్రామ శివారులోని తాయమ్మ మిట్ట వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు.
ఆ సమయంలో వేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సింహాద్రికి తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కాగ సింహాద్రి రాత్రి కుటుంబసభ్యులతో కొట్లాడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, కొండాపురం నుంచి గద్వాలకు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.






# పాలమూరు నుంచి ప్రజాపోరాటం

- రెండు బిల్లుల పై కేంద్రం కుట్ర
- డీలిమిటేషన్, మహిళా బిల్లుల పై బీజేపీ డ్రామా
- డీలిమిటేషన్ తో దక్షణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం
- కేంద్రం కుట్ర ను అడ్డుకునేందుకు ఏకతాటి పై ముందుకు వచ్చిన ప్రతిపక్షం
- పాలమూరు పోరుగడ్డ నుంచే కేంద్ర ప్రభుత్వం పై పోరాటం
- తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశంలో వక్తలు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

పాలమూరు పోరు గడ్డ నుంచి మరో ఉద్యమానికి ఊపిరి పోసేందుకు అఖిలపక్ష నాయకులు ఏకతాటి నిలబడ్డారు. మహిళా, డీలిమిటేషన్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం కుట్ర తో ప్రవేశపెట్టిందని, ఈ బిల్లులు బీజేపీ మనుగడకు మాత్రమే ఉపయోగించుకునే విధంగా ఉన్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ రెండు అంశాల పై శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు గడ్డ నుంచి మరో ప్రజా పోరాటానికి శంఖారావం పూరిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుల పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ బిల్లులను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ బిల్లుల వల్ల దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్ వంటి ప్రాంతాలకు నష్టం జరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఈ బిల్లును అడ్డుకున్నాయని తెలిపారు. 2023లో మహిళా బిల్లు ఆమోదం పొందినప్పటికీ అమలును 2034కు వాయిదా వేయడం సరైంది కాదని, వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ లాభం కోసం ఈ బిల్లులను తీసుకువచ్చారని, మహిళల ఓట్లు దక్కించుకోవడమే కేంద్ర లక్ష్యమన్నారు. ఈ బిల్లు ఆమోదమైతే దేశ ఐక్యతకు ప్రమాదమని, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అనంతరం జనాభాకు అనుగుణంగా రాజకీయ వాటా అనే సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కులగణన ద్వారా చట్టబద్ధంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ జరిగితే బీసీల రిజర్వేషన్లు దశాబ్దాల పాటు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మహిళా బిల్లు ప్రస్తుత పార్లమెంట్ సీట్లలోనే 33 శాతం రిజర్వేషన్‌తో వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదన్నారు.
బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, సోషల్ మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని తెలంగాణ నుంచి దేశ వ్యాప్తంగా విస్తరించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. దక్షిణ రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు, డీలిమిటేషన్‌లో న్యాయం జరిగేలా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ప్రధాన నినాదంగా ప్రకటిస్తూ, సామాజిక న్యాయం సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం , డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, పాశం యాదగిరి, జాన్ వెస్లీ, శారదాగౌడ్, కిల్లె గోపాల్, రఫీ, కార్పోరేటర్లు, అఖిల పక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి దిశ కమిటీ

- ఎంపీ డా. మల్లు రవి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**




జిల్లాలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా అందించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉపాధి సృష్టిలో బ్యాంకింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ వంటి పథకాల ద్వారా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిస్తూ రుణాల మంజూరు వేగవంతం చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం పొందిన రుణ దరఖాస్తులకు తగిన రుణాలు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు కేవలం రుణాలే కాకుండా వ్యాపార మార్గదర్శకత్వం కూడా అందించాలని సూచించారు. మిషన్ భగీరథ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, ఫలితాలు, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు వసతి, ఆహారం, భద్రత కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది, ఔషధాల సరఫరా, అత్యవసర సేవలు అందాలని స్పష్టం చేశారు. గ్రామీణ అభివృద్ధి పనులు నిర్ణీత గడువుల్లో పూర్తి కావాలని, పనుల నాణ్యతపై రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.
ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు తీగల సునేంద్ర, శ్రీనివాసులు, దిశా కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందొద్దు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**



ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల ఆందోళనపై మంత్రి ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు సంయమనం పాటించాలని కోరారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమ్మెను విరమింపజేసే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్మికులతో చర్చలు జరుపుతోందని తెలిపారు. ఈ సమయంలో తొందరపాటు చర్యలకు దిగవద్దని హెచ్చరించారు. ప్రతిపక్షాల మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని కార్మికులకు సూచించారు. ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టడం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. ఆర్టీసీ కార్మికుల ఆందోళనను ఉక్కుపాదంతో అణిచివేసిన చరిత్ర గత ప్రభుత్వానిదేనని ఆరోపించారు. 55 రోజుల సమ్మె జరిగినప్పుడు స్పందించలేదని, 36 మంది కార్మికులు మరణించినా పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. సమ్మె చేస్తే డిస్మిస్ చేస్తామని నాటి పాలకులు హెచ్చరించారని గుర్తుచేశారు.

## దివ్యాంగులకు మంత్రి ఉపకరణాల పంపిణీ


**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ఆవరణలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 44 మంది దివ్యాంగులకు వాహనాలను పంపిణీ చేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 17 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు అందజేశారు. అలాగే 20 మంది బాలికలకు సైకిళ్లు, 6 మోటార్ వీల్‌చైర్లు, 10 బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఒక బ్యాటరీ ఆటోను లబ్ధిదారులకు అందించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. దివ్యాంగుల సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, వారు సమాజంలో ఎవరికీ తీసిపోరని స్పష్టం చేశారు. దివ్యాంగులకు సమాన గౌరవం, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యతో పాల్గొన్నారు.

# బస్తీమే సవాల్...!

- రాజీనామా చేసి గెలిస్తే, ఎమ్మెల్యేగా పోటీచేయను
- దేవరకద్ర ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యేకు సవాల్
- ఎమ్మెల్యే అవినీతిలో రాజ్యమేలాడు.. ఇసుక దందాలో అరితేరాడు
- బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారు
- భాష మార్చుకోక పోతే వీడియోలు, ఫోటోలు బయటికి వస్తాయి
- మీడియా సమావేశం లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



ఎమ్మెల్యే చదువుకున్న మూర్ఖుడని, మంచి అనిపించుకునేందుకు తమపై బురద చల్లుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయనపై దుమ్మెత్తి పోశారు. దేవరకద్ర నియోజకవర్గంలోని చెరువుల్లో నల్ల మట్టిని కొల్లగొట్టి రూ. కోట్లు సంపాదించావని, ప్రతి పనికి ఒక రేట్ నిర్ణయించి ఎమ్మెల్యే పదవికే మచ్చ తెచ్చావని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిపై ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఇటీవల తీవ్రమైన ఆరోపణలపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
తన హయాంలో తాను ఒక సివిల్ ఇంజినీర్ గా పనిచేసిన అనుభవంతో సొంతంగా ఆలోచించి ఎమ్మెల్యేగా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా 11 గ్రామాలకు సాగునీరు అందించామన్నారు. పెద్ద ,ఊక చెట్టు వాగుల పై 36 చెక్ డ్యాంల నిర్మాణం చేసి నీటిని ఒడిసిపట్టమన్నారు. అతి తక్కువ ఖర్చుతో బండర్ పల్లి వద్ద చెక్ డ్యామ్ నిర్మించామని, కరివెన రిజర్వాయర్ పాలమూరు ప్రాజెక్టు డిజైన్ లో లేదని, సొంతంగా అక్కడ తిరిగి రిజర్వాయర్ నిర్మాణం చేయొచ్చని కేసీఆర్ ను ఒప్పించామన్నారు. అయితే ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాత్రం న్యాయవాద తెలివితో అక్రమ కేసులు,సెక్షన్లు, ఎఫ్ ఐ ఆర్, ఛార్జ్ షీట్ ఎలా చెయ్యాలో అని ఆలోచిస్తుంటారన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలం మార్చమని అడిగిన వారిపై కేసు పెట్టి జైలులో వేశారన్నారు. కురుమూర్తి స్వామి సాక్షిగా చెప్తున్న నల్లమట్టిలో అవినీతి చేయలేదన్నారు. రిజర్వాయర్ లు నిర్మించాలంటే కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరం ఉంటుందనే విషయం ఎమ్మెల్యే కు తెలియదన్నారు. చెరువుల్లో మట్టి తీసి రిజర్వాయర్ నిర్మించామని, దీంతో చెరువుల్లో నీటి నిల్వ పెంచినమన్నారు. కురుమూర్తి స్వామి దగ్గరికి వెళ్దాం.. ఇద్దరం ప్రమాణం చేద్దామా అని సవాల్ చేశారు. నీ పని తీరు మీద నమ్మకం ఉంటే రాజీనామా చేసి పోటీ చేయాలని, నువ్వు గెలిస్తే తాను ఎమ్మెల్యే గా మళ్ళీ పోటీ చేయనని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తమ్ముడు చెక్ డ్యామ్ లు కడితే అప్పుడే కొట్టుకుపోయిందని, నియోజకవర్గంలో ఇసుక దందాలో అరితేరారని, ప్రతి బండికి ఓ రేట్ కట్టి వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే పై మండిపడ్డారు. హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో ఏం చేస్తున్నావో అంతా తెలుసని, ఇకముందు భాష మార్చుకోక పోతే వీడియోలు, ఫోటోలు బయటికి వస్తాయని ఎమ్మెల్యే ను హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వేసవిలో మద్యం తాగితే రోగనిరోధక శక్తి తగ్గుదల**

మద్యం ఇమ్యూనిటీని తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్లకు శరీరం బలహీనంగా మారుతుంది.

## ఆమ్ ఆద్మీకి షాక్..

- **బీజేపీలోకి రాఘవ్ చద్దా**

**ముద్ర డెస్క్:**



ఇటీవల పార్లమెంటులో ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా విస్తృతంగా ప్రశ్నలు వేస్తున్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు.. మరే పార్టీ ఎంపీ కూడా ఈ స్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు కనిపించడం లేదు. టెలికాం కంపెనీల మోసాల నుంచి మొదలు పెడితే.. ప్రభుత్వ పనులలో జాప్యం వరకు ప్రతి విషయంలోనూ ప్రశ్నిస్తూనే ఉన్నాడు రాఘవ్. దీంతో అతని గురించి జాతీయ మీడియాలో విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఇన్ని సంవత్సరాలకు ప్రశ్నించే గొంతుక పార్లమెంట్ లో ప్రజా సమస్యల మీద మాట్లాడుతోందని మీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి.
రాఘవ్ పార్లమెంట్లో ప్రశ్నించిన తీరును సాధారణంగా మరో పార్టీ అయితే కచ్చితంగా నెత్తిన పెట్టుకునేది. కానీ ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రం అతడు ప్రశ్నిస్తున్న తీరును పట్టించుకోలేదు. పైగా అతడిని పార్టీకి సంబంధించిన నాయకుడు కాదు అన్నట్టుగా ప్రవర్తించింది. కొన్ని సందర్భాలలో అతని గురించి మాట్లాడటం అనవసరమని ఆ పార్టీ నాయకులు చెప్పడం విశేషం. పార్టీ అధినాయకత్వం రాఘవ్ ను దూరం పెట్టడం మొదలుపెట్టింది. దీంతో అతడు తన రాజకీయ ప్రయాణాన్ని మరో విధంగా మొదలుపెట్టాలని అనుకున్నాడు. ఈ క్రమంలోనే బీజేపీ అధినాయకత్వం అతనికి టచ్లోకి వెళ్లింది. అంతే ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.
ఆప్ నుంచి రాఘవ్ బీజేపీలో చేరిపోయారు. ఒక రకంగా అతడి నిర్ణయం ఆ పార్టీ అధినాయకత్వానికి షాక్ లాగా అనిపించింది. అతడు పార్టీలో చేరడం మాత్రమే కాదు.. కేంద్ర మంత్రి పదవి కూడా లభిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయన కేంద్ర మంత్రి అవుతారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ప్రజల సమస్యల మీద రాఘవ్ కీలకంగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి టెలికాం కంపెనీలు అడ్డగోలుగా వసూలు చేయడం.. వినియోగించని డాటాను కస్టమర్ల ఖాతాలో జమ చేయలేకపోవడం.. అనవసరమైన చార్జీలు వినిపించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఆయన ప్రశ్నిస్తున్న తీరు పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా గమనించింది. సోషల్ మీడియాలో అతనికి సపోర్ట్ గా ఇప్పటికీ ఒక ఉద్యమం నడుస్తూనే ఉంది. అయితే రాఘవ్ వ్యవహరిస్తున్న తీరు ఆప్ అధినాయకత్వానికి ఇబ్బందిగా అనిపించినట్టు తెలుస్తోంది. అందువల్లే అతడికి అంతగా సపోర్ట్ ఇవ్వడం లేదు. దీంతో రాఘవ్ కూడా బీజేపీలో చేరాలని అనుకున్నారు. తన సమ్మతిని బీజేపీ అధినాయకత్వానికి వెల్లడించారు. అతడి వ్యవహార శైలి నచ్చిన బీజేపీ అధినాయకత్వం అతడి రాక పట్ల సుముఖత వ్యక్తం చేసింది. ఒకవేళ రాఘవ్ కేంద్ర మంత్రి అయితే.. ప్రజల సమస్యలపై మరింత గొప్పగా తన వాయిస్ వినిపిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## చర్చిద్దాం.. పరిష్కరించుకుందాం

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **ఆర్టీసీ కార్మిక సంఘ నేతలతో మంత్రుల కమిటీ చర్చలు**
- **ఆత్మహత్యలకు పాల్లడవద్దని పిలుపు**
- **ప్రజా పాలనలో ఎవరినీ శత్రువులుగా చూడం**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో |ఆర్టీసీ చిన్నాభిన్నం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



**సుహృద్భావ వాతావరణంలో చర్చలు..**

మంత్రులు, ఆర్టీసీ జేఏసీ మధ్య సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయి. మంత్రుల బృందం..అన్ని సంఘాల అభిప్రాయాలను సవివరంగా నమోదు చేసుకున్నది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు కమిటీ కి తమ సమస్యలు విన్నవించారు. తమ దశాబ్దాల పెండింగ్ సమస్యలు ప్రజా ప్రభుత్వం తీర్చిందన్నారు. గత ప్రభుత్వం లో 55 రోజుల సమ్మె చేసిన తమకు ఎలాంటి హామీ నెరవేర్చకపోయిందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం రాగానే రెండేళ్ల లోనే 2013 బాండ్స్ రూ.280 కోట్లు క్లియర్ చేసిందని తెలిపారు. యూనియన్ లు లేకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రచారం జరగలేదని మంత్రులకు వివరించారు.

సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సమస్య ఎంత క్లిష్టమైనదైనా సరే.. కూర్చుని మాట్లాడుకుంటే ఖచ్చితంగా పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమ ప్రభుత్వానికి లేదన్నారు. ఆర్టీసీ అనేది మన రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అన్న భట్టి... ఇతర రాష్ట్రాల్లో సంస్థల పరిస్థితి వేరుగా ఉన్నా, మన సంస్థను మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల కమిటీ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క కార్మిక సంఘ నేతలతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ఆర్టీసీ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని చెప్పారు. పాలనాపరంగా సంస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఆనాడు పరిస్థితులను తట్టుకోలేక కార్మికులు సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో అప్పటి పాలకులు ఎంత కఠినంగా ప్రవర్తించారో మీరందరూ చూశారన్నారు. గత పాలకుల మాదిరిగా తాము వ్యవహరించబోమని హామీ ఇచ్చారు. బడ్జెట్ సమావేశాలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా బిల్లు, ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, ఇతర మంత్రులు బిజీగా ఉన్న సమయంలో.. అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఒక కార్మికుడిని కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున తాము, కార్మిక సంఘాల నేతలుగా మీరు సమిష్టిగా కార్మికులకు పిలుపునిద్దామన్నారు. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు.

## కేడర్ బలోపేతమే లక్ష్యం

- **క్లస్టర్ ఇన్‌చార్జిలకు సీఎం చంద్ర బాబు దిశానిర్దేశం**

**ముద్ర న్యూస్:**



కేడర్ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్లస్టర్ ఇన్‌చార్జిల శిక్షణా తరగతులకు ఆయన హాజరై పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో పాల్గొని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నేరుగా ముచ్చటించారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలు వంటి కీలక అంశాలపై ఆయన వివరంగా చర్చించారు. ప్రతి కార్యకర్త నాయకుడిగా ఎదగాలని, అందుకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమకాలీన రాజకీయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమని చెప్పారు. 2019 నుంచి 2024 మధ్య రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. ఆ కాలంలో జరిగిన పరిణామాలను ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే వారు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, దీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు ఘటన వంటి అంశాలను ప్రస్తావించారు. నేరగాళ్లతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలకే అధినేత స్థానం ఉంటుందన్నారు. వారికి పార్టీ పూర్తి గౌరవం ఇస్తుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పడుతున్న కష్టాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు, పార్టీ చేస్తున్న మంచి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.



## నిప్పులు కురుస్తున్నాయి...!

- **అకెనపల్లిలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు**

**ముద్ర డెస్క్:**

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా 44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత శుక్రవారం పెద్దపల్లి జిల్లా అకెనపల్లిలో రికార్డయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.1, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్టులో 43.8, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల అయిదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల స్థాయిలోనే నమోదవుతాయని, కనిష్ఠంగా రాత్రి ఉష్ణోగ్రతలు 2930 డిగ్రీలకు పెరుగుతాయని జగిత్యాల పరిశోధనకేంద్రం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలో తేమ ఉదయం 3050 శాతం, మధ్యాహ్నం 1015 శాతం వరకు ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని చెప్పారు.



## యాదగిరీశుడి సేవలో సీపీ

**ముద్ర, యాదగిరిగుట్ట:**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని శుక్రవారం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్ర చార్యులు ఆధ్వర్యంలో ఆశీర్వదించారు. సూపరెంటెండెంట్ రాజన్ బాబు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరి రావు, టౌన్ సీఐ భాస్కర్, ఎస్బీ సత్యనారాయణ, నందు నాయక్ కృష్ణ ఉన్నారు.

## శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, హైదరాబాద్:**



ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన కుటుంబానికి రూ.2 కోట్ల ఎక్స్ గ్రెషియా చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశత్వానికి ఆర్టీసీ డ్రైవర్ బలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కోన ఊపిరితో చికిత్స పొందుతున్న శంకర్ గౌడ్ ను పరామర్శించేందుకు తాను వెళ్తే ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్యే అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు సంస్థలో యూనియన్లను పునరుద్ధరించాలని ఆమె కోరారు.

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు క్యాన్సర్

- **చికిత్స చేసుకుంటున్నట్టు సంచలన ప్రకటన**

**ముద్ర డెస్క్:**



కొంత కాలంగా తాను ప్రోస్టేట్ క్యాన్సర్‌కు చికిత్స చేయించుకుంటున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఈ చికిత్స విషయాన్ని ముందుగా వెల్లడించలేదని పేర్కొన్నారు. దీనిని ఆసరాగా తీసుకొని తన ఆరోగ్యంపై టెహ్రాన్ తప్పుడు వార్తలు ప్రచారం చేసే అవకాశం ఉండడంతో తన సమస్యను బయటపెట్టలేదన్నారు.
ప్రారంభ దశలోనే క్యాన్సర్‌కు చికిత్స తీసుకోవడం వల్ల ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. చికిత్స కొనసాగుతోందన్నారు.
ఏడాదిన్నర క్రితం తనకు ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చినట్లు నెతన్యాహు తెలిపారు. నాటి నుంచి చికిత్స తీసుకుంటున్నానని.. ఇటీవల విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందన్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు వెల్లడించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానిని వెంటనే పరిష్కరించుకోవాలనే సిద్ధాంతాన్ని తాను అవలంబిస్తానని అన్నారు. వ్యక్తిగత, వృత్తి జీవితాల్లోనూ ఇదే విధంగా నడుచుకుంటానని తెలిపారు. ఈ వ్యాధి విషయంలోనూ అదే చేశానన్నారు. తనకు చికిత్స చేసిన జెరూసలెంలోని హదాస్సా ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని..ఏ చిన్న సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- **90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం**
- **8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**
- **ఇప్పటికే 5 వేల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయన్నారు. సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదని పేర్కొన్నారు. రబీ సీజన్ లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్, డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు, జనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు, ఫైనాన్స్ ,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగిందన్నారు. అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే ఐదు వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అయ్యిందన్నారు. సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామన్నారు. మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు గాను కొనుగోలు కేంద్రాల్లో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.
కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లినర్లు, డ్రైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలీలను నియమించాలని పేర్కొన్నారు. తూకం ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం తరలి రాకుండా ఉండేలా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అయ్యో మొత్తాలను రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖ మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

వేసవిలో మద్యం తాగితే డీహైడ్రేషన్ వల్ల తలనొప్పి
నీరు తగ్గడం వల్ల తీవ్ర తలనొప్పులు వస్తాయి. మద్యం దీనిని మరింత పెంచుతుంది.




## సన్‌రైజర్స్ ,ఆర్ఆర్ మధ్య ప్రతీకార పోరేనా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ (RR) మధ్య శనివారం జరగబోయే మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది. తొలి దశలో హైదరాబాద్ 57 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని రాజస్థాన్ రాయల్స్ ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

ఆ మ్యాచ్‌లో యువ పేసర్ ప్రఫుల్ హింజ్ తన ఐపీఎల్ అరంగేట్రంలోనే తొలి ఓవర్‌లో మూడు వికెట్లు తీసి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీని గోల్డెన్ డక్‌గా ఔట్ చేయడం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ఆ పరాజయం ఇప్పటికీ రాజస్థాన్ క్యాంప్‌లో చర్చనీయాంశంగానే ఉంది.

ఇక రేపటి మ్యాచ్ సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరగనుండటంతో తమ హోమ్ గ్రౌండ్‌లో సత్తా చాటాలని రాజస్థాన్ చూస్తోంది. ఇటీవల లక్నోపై విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న ఆ జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ మంచి ఫామ్‌లో ఉండగా, జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ విభాగానికి బలం అందిస్తున్నాడు. అయితే కెప్టెన్ రియాన్ పరాగ్ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది.

మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అటాకింగ్ బ్యాటింగ్‌తో దూకుడు కొనసాగిస్తోంది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్ వంటి బ్యాటర్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ మంచి ఫామ్‌లో ఉండటం బ్యాటింగ్‌కు మరింత బలం ఇచ్చింది. బౌలింగ్‌లో ప్రఫుల్ హింజ్ వంటి యువ ఆటగాళ్లు మంచి ప్రభావం చూపుతున్నా, పాట్ కమిన్స్ లేకపోవడం జట్టుకు కొంత లోటుగా మారింది.

ఈ నేపథ్యంలో ఒకవైపు ప్రతీకారం తీర్చుకోవాలన్న రాజస్థాన్ ఉత్సాహం, మరోవైపు ఆధిపత్యం కొనసాగించాలన్న హైదరాబాద్ లక్ష్యం ఈ మ్యాచ్‌ను హై ఓల్టేజ్ పోరుగా మార్చాయి. క్రికెట్ అభిమానులకు ఇది మరో ఉత్కంఠభరితమైన సమరంగా నిలవనుంది.

## ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేస్‌లో ఒత్తిడి..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ జట్టు సీజన్‌ను మంచి ఆరంభంతో మొదలుపెట్టినా, ప్రస్తుతం ప్లేఆఫ్స్ రేస్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తొలి మ్యాచ్‌లో కోల్కతా నైట్ రైడర్స్‌పై విజయం సాధించిన ముంబై, ఆ తర్వాత వరుసగా ఫామ్ కోల్పోవడంతో ఇబ్బందుల్లో పడింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో వాంఖెడేలో జరిగిన తాజా మ్యాచ్‌లో ఓటమి జట్టును మరింత వెనక్కి నెట్టింది.

హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి కేవలం 2 విజయాలు మాత్రమే నమోదు చేసింది. 4 పాయింట్లు, 0.736 నెట్ రన్ రేట్‌తో జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది.

ప్లేఆఫ్స్‌కు చేరాలంటే కనీసం 16 పాయింట్లు అవసరం కావడంతో మిగిలిన 7 మ్యాచ్‌లు ముంబైకి అత్యంత కీలకంగా మారాయి. అందులో కనీసం 6 మ్యాచ్‌లు గెలిస్తేనే టాప్ 4లో స్థానం దక్కే అవకాశం ఉంటుంది. 5 విజయాలు సాధించినా 14 పాయింట్లకు చేరుతుంది గానీ, అది నెట్ రన్ రేట్, ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది.

గత చరిత్ర చూస్తే ముంబై ఇండియన్స్ ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి పుంజుకున్న సందర్భాలు ఉన్నాయి. 2015 సీజన్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలో మొదట్లో ఇబ్బంది పడిన జట్టు, ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని టైటిల్ గెలుచుకుంది. గత సీజన్‌లో కూడా చివరి దశలో బలమైన ప్రదర్శనతో ప్లేఆఫ్స్ చేరింది.

అయితే ఈసారి పోటీ మరింత కఠినంగా ఉండటంతో ముంబైకి ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలో స్థిరత్వం చూపించకపోతే ప్లేఆఫ్స్ రేస్ మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది.






## వైభవ్ బలహీనతను పట్టేసిన ప్రఫుల్ హింజ్..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ ప్రఫుల్ హింజ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ బలహీనతను అద్భుతంగా క్యాచ్ చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘనతగా, తన తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన హింజ్, ఫామ్‌లో ఉన్న సూర్యవంశీని గోల్డెన్ డక్‌గా వెనక్కి పంపాడు. మ్యాచ్ అనంతరం హింజ్ మాట్లాడుతూ, సూర్యవంశీకి షార్ట్ బాల్ మీద పుల్ షాట్ ఆడే అలవాటు ఉందని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. అదే కారణంగా బౌన్సర్‌తో ప్లాన్ చేశామని, బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ సూచనలతో ఆ వ్యూహాన్ని అమలు చేసినట్లు వెల్లడించాడు. అనుకున్నట్టుగానే బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతికి సూర్యవంశీ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించి టైమింగ్ మిస్ అయ్యాడు. బంతి టాప్ ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతిలో పడటంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది. ఈ ఒక్క వికెట్‌తోనే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ వికెట్లతో రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టిన హింజ్, మొత్తం నాలుగు వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ 57 పరుగుల తేడాతో విజయం సాధించింది



## ప్రశాంత నాయకత్వమే బలం

- శ్రేయస్ అయ్యర్‌పై బార్ట్‌లెట్ ప్రశంసలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో అత్యంత ఆసక్తికర జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. జట్టు పేసర్ జేవియర్ బార్ట్‌లెట్ చేసిన వ్యాఖ్యలు జట్టులో ఉన్న సానుకూల వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ద్వయంపై జట్టులో భారీ అంచనాలు ఉన్నట్లు పేర్కొన్నారు.శ్రేయస్ అయ్యర్ ఒత్తిడిని చాకచక్యంగా ఎదుర్కొనే నాయకుడని బార్ట్‌లెట్ తెలిపారు. మైదానంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ప్రశాంతంగా ఉండటం అతని ప్రత్యేకతగా వివరించారు. ఈ లక్షణాల వల్లే అతను విజయవంతమైన కెప్టెన్‌గా, నమ్మదగ్గ బ్యాటర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. రికీ పాంటింగ్ మార్గదర్శకత్వంలో జట్టు ముందుకు సాగుతుండటంతో ఆటగాళ్లలో ఎటువంటి ఆందోళన లేదని వెల్లడించారు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాడని బార్ట్‌లెట్ ప్రశంసించారు. అతని ప్రతిభ జట్టుకు ప్రధాన బలంగా మారిందని తెలిపారు. ఐపీఎల్‌లో చర్చనీయాంశమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై కూడా సానుకూలంగా స్పందించారు. ఈ నియమం వల్ల జట్లకు అదనపు బ్యాటర్ లేదా బౌలర్‌ను వినియోగించే అవకాశం లభిస్తుందని, టీ20 క్రికెట్‌కు మరింత ఉత్కంఠను తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రశాంత నాయకత్వం, అనుభవజ్ఞులైన కోచ్ మార్గదర్శకత్వం, ప్రతిభావంతులైన పేసర్లతో టైటిల్ వేటలో గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుతం ఎలాంటి ఓటమి లేకుండా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## రోహిత్ రిటైర్మెంట్‌పై సెహ్వాగ్ షాకింగ్ వ్యాఖ్యలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సందర్భంగా గాయంతో బాధపడుతున్న రోహిత్ శర్మ ముంబై జట్టు శిబిరంలోనే ఉంటూ కోలుకుంటున్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున బెంగళూరుపై జరిగిన మ్యాచ్‌లో గాయపడిన రోహిత్ ఇప్పటికే రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. తదుపరి మ్యాచ్‌లో కూడా అతని ఆడే అవకాశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ముంబై ఇండియన్స్ చిత్తుగా ఓడింది.

ఈ పరిస్థితిపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ వరుస ఓటములతో ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ఇదే ఆటతీరు కొనసాగితే ఎలిమినేషన్ తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా జట్టు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోహిత్ శర్మ ఫామ్ ఆశించిన స్థాయిలో లేదని, అతడు గాయపడడం జట్టుకు తీవ్రమైన దెబ్బగా మారిందని పేర్కొన్నారు. రిటైర్మెంట్ గురించి రోహిత్ శర్మ ఆలోచించాల్సిన సమయం వచ్చిందని కూడా వ్యాఖ్యానించారు. అభిమానులు ప్రశ్నించే పరిస్థితి రాకముందే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

జట్టు ప్రదర్శన బలహీనంగా ఉండటంతో రోహిత్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రోహిత్ శర్మ తిరిగి ఎప్పుడు మైదానంలోకి దిగుతారనేది ఇంకా స్పష్టత లేని పరిస్థితిలో ముంబై ఇండియన్స్ ఉందని సెహ్వాగ్ వ్యాఖ్యానించారు.



## సంజు సెంచరీపై శశిథరూర్ ప్రశంసలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

చెన్నై జట్టు వికెట్ కీపర్ సంజు శాంసన్ సెంచరీతో అదరగొట్టిన సంగతి తెలిసిందే. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వాంఖడే వేదికగా 54 బంతుల్లో 101 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. అతని అద్భుత ఇన్నింగ్స్‌తో చెన్నై జట్టు ముంబైపై 103 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సెంచరీ నమోదు చేసిన సంజు శాంసన్ ఆటతీరుపై కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు శశిథరూర్ ప్రశంసలు కురిపించారు. సంజు బ్యాటింగ్ శైలిని కవిత రూపంలో అభినందిస్తూ అతని ప్రతిభను కొనియాడారు.శిల్పాన్ని చెక్కినట్లుగా సంజు సెంచరీ పూర్తి చేశాడని శశిథరూర్ వ్యాఖ్యానించారు. సంజులో ప్రత్యేకమైన నైపుణ్యం ఉందని, మణికట్టును సమర్థంగా ఉపయోగిస్తూ అతడు ఆడే షాట్లు ఎంతో అందంగా కనిపిస్తాయని పేర్కొన్నారు. బంతి బ్యాట్‌కు తగిలినప్పుడు వచ్చే శబ్దం, టైమింగ్ చూస్తే అతడు క్లిష్టమైన పనులను సులభంగా చేస్తున్నట్లుగా అనిపిస్తుందని తెలిపారు.




## ఓటమి తర్వాత ముంబై ఆటగాళ్లకు రిలీఫ్.. వనతార ట్రిప్‌కు పంపిన అంబానీ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో చిత్తుగా ఓడిపోయిన ముంబై ఇండియన్స్ ఆటగాళ్లకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నారు జట్టు యాజమాన్యం. ఓటమి బాధలో ఉన్న ఆటగాళ్లు మానసికంగా రిలాక్స్ కావడానికి ఐదు రోజుల ఫ్యామిలీ ట్రిప్‌కు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం అంబానీ తీసుకున్నట్లు తెలుస్తోంది.ఏప్రిల్ 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 103 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమితో అభిమానుల్లో నిరాశ నెలకొంది. ముంబై ఇండియన్స్ తదుపరి మ్యాచ్ ఏప్రిల్ 29న ఉండటంతో మధ్యలో ఐదు రోజుల విరామం లభించింది. ఈ విరామాన్ని ఉపయోగించుకుని ఆటగాళ్లు ఉత్సాహంగా తిరిగి మైదానంలోకి రావాలనే ఉద్దేశంతో జట్టు సభ్యులను జామ్‌నగర్‌లోని వనతారకు పంపినట్లు తెలిసింది. ఇందులో భాగంగా జట్టు బౌలర్లు బుమ్రా, బౌల్ట్ సహా ఇతర ఆటగాళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి వనతారకు బయలుదేరారు.ఆటగాళ్లు ఐదు రోజుల పాటు వనతారలో గడుపుతూ విశ్రాంతి తీసుకోనున్నారు. అనంతరం తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతారని జట్టు వర్గాలు తెలిపాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews







# ఈవెంట్ షో స్టీలర్‌గా కృతి సనన్..

ముద్ర, సినిమా డెస్క్ :

ముంబైలో జరిగిన GQ మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ యంగ్ ఇండియన్స్ 2026 ఈవెంట్‌లో క్రితి సనన్ తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ లేటెక్స్ బాడీకాన్ గౌన్‌లో ఆమె ఎంట్రీ ఇచ్చిన క్షణమే ఈవెంట్ మొత్తం హైప్‌గా మారింది.

అట్సుకో కుడో డిజైన్ చేసిన ఈ గౌన్‌లో థైహై స్లిట్, డీప్ ప్లంజింగ్ వైట్ ట్రిమ్ నెక్‌లైన్, గ్లోసీ ఫినిష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్కై హై హీల్స్‌తో కలిపి ఆమె లుక్ మరింత బోల్డ్ అండ్ గ్లామరస్‌గా కనిపించింది. రెడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ అవుట్‌ఫిట్ సినిమాటిక్ ఫీల్‌ను తీసుకొచ్చింది.

ఇది కేవలం ఫ్యాషన్ లుక్ మాత్రమే కాకుండా ఒక స్టేట్‌మెంట్‌గా మారింది. ఈవెంట్‌కు హాజరుకావడమే కాకుండా మొత్తం స్పాట్‌లైట్‌ను తనవైపు తిప్పుకుంది క్రితి సనన్. ఆమె కాన్ఫిడెన్స్, స్టైల్ కలయికతో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.



# స్టార్ సినిమాల కోసం యంగ్ హీరోయిన్ల రిస్క్..

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్‌లో ఇద్దరు యంగ్ హీరోయిన్లు స్టార్ హీరోల సినిమాల కోసం ఇతర పెద్ద అవకాశాలను వదులుకుంటున్నారన్న వార్త ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'డ్రాగన్'లో హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ కోసం భారీ డేట్స్ అవసరం కావడంతో, ఆమె మరో 3 నుంచి 4 పెద్ద ఆఫర్లను తిరస్కరించినట్లు టాక్ వినిపిస్తోంది.

మరోవైపు నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'లో కయ్యదు లోహర్ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా కోసం ఆమె కూడా ఇతర అవకాశాలను పక్కన పెట్టి పూర్తిగా ఈ ప్రాజెక్ట్‌పైనే ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

స్టార్ సినిమాల కోసం ఈ విధంగా అవకాశాలను వదులుకోవడం రిస్క్‌గా కనిపించినా, కెరీర్‌కు బిగ్ బ్రేక్ దక్కే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి.



# నందమూరి ఫ్యాన్స్‌కు పూనకాలే..

- బాలకృష్ణ–కొరటాల శివ కాంబో సినిమా ఖరారు

ముద్ర, సినిమా డెస్క్ :

నందమూరి అభిమానులకు ఉత్సాహాన్ని పెంచే వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. 'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో భారీ సినిమా రూపుదిద్దుకోబోతోందని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌పై గత కొంతకాలంగా వినిపిస్తున్న ప్రచారానికి ఇప్పుడు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది.

తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మే 1న పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం బాలకృష్ణ తన 111వ చిత్రాన్ని గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తున్నారు. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే కొరటాల శివ ప్రాజెక్ట్‌ను కూడా ముందుకు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. జూన్ నుంచి ఈ సినిమాకు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.

కొరటాల శివ తన సినిమాల్లో బలమైన మెసేజ్‌తో పాటు పవర్ఫుల్ హీరో క్యారెక్టరైజేషన్‌ను చూపిస్తారు. ఇప్పుడు బాలకృష్ణ మాస్ ఇమేజ్‌తో ఈ శైలి కలిస్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 2027 సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని ప్రణాళికలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు 'దేవర' విజయంతో ఉన్న కొరటాల శివ, ఎన్టీఆర్‌తో 'దేవర 2' ప్రారంభించే ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయనున్నారని సమాచారం. త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# బ్లాక్ బాడీకాన్‌లో మత్తెక్కిస్తున్న సంయుక్త

ముద్ర, సినిమా డెస్క్ :

సంయుక్తా మేనన్ తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ బాడీకాన్ డ్రెస్‌లో స్టైలిష్ గ్లామర్ లుక్‌తో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. మౌవ్ షేడ్ సాటిన్ ఆఫ్ షోల్డర్ డిజైన్‌తో ఉన్న డ్రేప్ ఆమె అవుట్‌ఫిట్‌కు హై ఫ్యాషన్ టచ్‌ను తీసుకొచ్చింది.

వైన్ కలర్ ఫాబ్రిక్ భుజాలపై అందంగా మడతలు పడుతూ ఎలిగెంట్ లుక్‌ను క్రియేట్ చేసింది. వేవీ బ్రౌన్ హెయిర్, మెరిసే స్కిన్ టోన్, డైమండ్ డ్రాప్ ఇయరింగ్స్ కలిసి ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి.

క్లోజ్ అప్ షాట్‌లో సంయుక్తా చూపులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బ్రౌన్ కళ్లతో పాటు డస్కీ రోజ్ లిప్ షేడ్ ఆమె లుక్‌కు అదనపు పవర్‌ను ఇచ్చింది.

మొత్తం లుక్‌లో ఆమె దుస్తులు మాత్రమే కాదు, ఆ స్టైల్‌ను పూర్తిగా తనదిగా మలుచుకుని మెరిసింది



# రెడ్ డ్రెస్‌లో రకుల్ హాట్ లుక్..


ముద్ర, సినిమా డెస్క్ :

అయుష్మాన్ ఖురానా నటిస్తున్న తాజా కామెడీ చిత్రం 'పతి పత్ని ఔర్ వో దో'లోని కొత్త పాట "రోప్ ది రాణి" ప్రమోషన్లతో రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పాట ప్రచారంలో భాగంగా రకుల్ విడుదల చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బోల్డ్ రెడ్ మినీ డ్రెస్‌లో, ఆకట్టుకునే రఫుల్ షోల్డర్స్‌తో ఆమె కనిపించి గ్లామర్ లుక్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది. గోల్డ్ హూప్ ఇయరింగ్స్, స్లీక్ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. "రోప్ ది రాణి" టీజర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి హైప్ క్రియేట్ చేసింది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్‌తో పాటు అయుష్మాన్ ఖురానా, వామికా గబ్బి, సారా అలీ ఖాన్ కలిసి చేసిన డాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రంగురంగుల విజువల్స్, ఎనర్జిటిక్ మ్యూజిక్‌తో సినిమా స్టైల్‌ను టీజర్ స్పష్టంగా చూపిస్తోంది. ఈ చిత్రం 2026 మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త పాట కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెద్ది రిలీజ్ డేట్‌పై సస్పెన్స్..

- 'లెనిన్'కు మరోసారి షాక్?

ముద్ర, సినిమా డెస్క్ :



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'పెద్ది'పై అంచనాలు భారీగా ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్' తర్వాత చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతి బాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, సాయి కుమార్ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మొదట ఏప్రిల్ 30న విడుదల కావాల్సి ఉండగా, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యంతో జూన్‌కు వాయిదా పడింది. తాజాగా జూన్ 25ని ఫైనల్ రిలీజ్ డేట్‌గా మేకర్స్ లాక్ చేసినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంతో మరో సినిమాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మే 1న విడుదల కావాల్సిన 'లెనిన్' చిత్రం, అప్పట్లో 'పెద్ది' వాయిదా కారణంగా జూన్ 26కి షిఫ్ట్ అయ్యింది. ఇప్పుడు 'పెద్ది' జూన్ 25కి ఫిక్స్ కావడంతో 'లెనిన్' టీమ్ మళ్లీ డైలమాలో పడినట్లు టాక్ వినిపిస్తోంది.

ఇండస్ట్రీ వర్గాల ప్రకారం గ్లోబల్ స్టార్ సినిమా ఎదురుగా రావడం రిస్క్ కావడంతో 'లెనిన్' మళ్లీ వాయిదా పడే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఇక 'పెద్ది'లో ఒక స్పెషల్ ఐటమ్ సాంగ్ కూడా ఉండనుందని, ఆ పాట కోసం పలువురు భామల పేర్లు పరిశీలించిన తర్వాత చివరకు శృతి హాసన్‌ను ఫైనల్ చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, ఈ సినిమా సమ్మర్ చివర్లో బాక్సాఫీస్ వద్ద పెద్ద ప్రభంజనం సృష్టించేందుకు సిద్ధమవుతోందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# చిక్కుల్లో 'దృశ్యం 3'.. రిలీజ్‌పై అనిశ్చితి

ముద్ర, సినిమా డెస్క్ :

మలయాళ సూపర్ హిట్ సిరీస్ 'దృశ్యం' మూడో భాగం 'దృశ్యం 3' విడుదలకు ముందే చట్టపరమైన వివాదంలో చిక్కుకుంది. మోహన్ లాల్ హీరోగా, జీతూ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై ఓటీటీ హక్కుల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది.ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్, గతంలో అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ ఒప్పందాన్ని రద్దు చేసినట్లు సమాచారం. దీనిపై అమెజాన్ ప్రైమ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మే 15 వరకు సినిమాకు సంబంధించిన కొత్త ఓటీటీ లేదా డిజిటల్ డీల్స్ కుదుర్చుకోవద్దని స్టే విధించింది. ఈ పరిణామాలతో సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొంది. ముందుగా మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించినా, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ తేదీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మోహన్ లాల్ అభిమానులు ఈ వివాదం త్వరగా పరిష్కారమై, 'దృశ్యం 3' అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావాలని ఆశిస్తున్నారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com